అనుదినం జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

1

గురువారం 02 ఫిబ్రవరి 2023

'కార్పొరేట్' బడ్జెట్

- ఉపాధికి భారీగా నిధులు తగ్గింపు
- విద్యారంగానికి ఈసారీ మొండిచేయి
- కేంద్ర బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు
- రైతు, కార్మిక వ్యతిరేక బడ్జెట్‌గా వర్ణన

నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైయ్యాయి. ఈసారి బడ్జెట్‌లో బడా కార్పొరేట్ కంపెనీలకు మేలు చేసే విధంగా కేంద్రం చర్యలు ఉన్నట్టు పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. గ్రామీణ పేదలకు పనులు కల్పించి ఆర్థికంగా ఊతం ఇస్తున్న ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చే విధంగా ఈసారి బడ్జెట్‌లో నిధులు మరింత తగ్గించింది. దీంతో పాటు ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి ఎలాంటి చర్యలూ చేపట్టక పోగా.. బడ్జెట్‌లో పది శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా.. 2.6 శాతం కేటాయిం చడంపై విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు. జిల్లాకు సంబంధించి పసుపు బోర్డు ఊసే ఎత్తలేరని, సికింద్రాబాద్-ముంబాయి వయా నిజామాబాద్ రైల్వే లైన్ డబ్లింగ్ పనులు, ఆదిలాబాద్-ఆర్మూర్, బీదర్-బోధన్ రైల్వే లైన్‌పై నిధులు కేటాయించలేదని జిల్లా వాసులు మండిపడ్డారు. చిరు వేతన జీవులపై కేంద్ర కనికరణ చూపలేదని, పన్ను మినహాయంపు 7 లక్షలకు చేసినట్టే చేసి మళ్లీ 3 లక్షల నుంచి శ్లాబుల వారీగా పన్నులు వేయడం సరికాదని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేశారు.



కార్పొరేట్ కంపెనీలకు అనుకూల బడ్జెట్



వెంకట్‌గౌడ్. సీపీఐ(ఎం)
కామారెడ్డి జిల్లా కార్యదర్శి

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ కార్పొరేట్ కంపెనీలకు అనుకూలమైంది. ఈ బడ్జెట్లో పేద ప్రజలను అభివృద్ధి చేసే దిశలో ఆలోచించకుండా కేవలం కార్పొరేట్ కంపెనీలకు లాభాలు తెచ్చే విధంగా ఉంది. కొత్త ఉద్యోగాల కల్పన లేదు. ఈసారి కూడా నిరుద్యోగులకు నిరాశే కల్పించారు. వ్యవసాయ రంగాన్ని దివాలా తీసే బడ్జెట్ అని విమర్శించారు. **-కామారెడ్డిటౌన్**

వేతన జీవులను వంచించిన కేంద్రం

టీఎస్‌యూటీఎఫ్

ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని స్వల్పంగా పెంచి మధ్యతరగతి వేతన జీవులకు భారీ ఊరట పేరుతో ప్రచారం చేసుకోవటం సమంజసం కాదని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ అభిప్రాయ పడింది. బడ్జెట్‌పై జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.సత్యానంద్, ఒ.రమేష్ తమ అభిప్రాయం వ్యక్త పరిచారు. పాత, కొత్త పన్ను విధానాలను కొనసాగిస్తూ క్రమంగా పాత పన్ను విధానాన్ని ఎత్తివేయటానికే కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు ఈ బడ్జెట్ ద్వారా స్పష్టమైంది. పరోక్ష పన్నుల ద్వారా వేతనాలనుండి ఆదాయాన్ని రాబట్టుకుంటున్న ప్రభుత్వం వేతనాలపై భారీగా పన్ను వేయటమే అర్థరహితం. కార్పోరేట్లు, ధనికులకు అధిక పన్ను రాయితీ ఇచ్చిన ప్రభుత్వం చిన్న, మధ్యతరగతి ఉద్యోగులకు ఏమాత్రం ప్రయోజనం కలిగించలేదు. ఈ బడ్జెట్ ద్వారా ధరలు ఏమాత్రం తగ్గే అవకాశం లేదు. గృహ నిర్మాణానికి ప్రోత్సాహం లేదు. మొత్తంగా సగటు వేతన జీవులకు ఏమాత్రం సంతృప్తిని కలిగించలేదు. **-కంఠేశ్వర్**

పీఆర్సీ ప్రయోజనాలపై ఐటీ దెబ్బ



కె.నాగరాజు, ఎంప్లాయీస్ అసోసియేషన్, జిల్లా అధ్యక్షులు.

వేతన జీవులు ఆశించిన ఊరట కేంద్ర బడ్జెట్ ఇవ్వలేదు. ఆదాయపు పన్ను మినహాయింపు రూ.10 లక్షల వరకు పెంచితే బాగుండేది. ఉద్యోగుల డిమాండ్ మేరకు మినహా యింపులు చేస్తే మేలు జరిగేది. అరకొర ఐటీ పరిమితి పెంపుతో, ఉద్యో గులు అసంతృప్తి చెందారు. పీఆర్సీతో జీతాలు పెరిగిన, ఐటీ దెబ్బకు రెండు, మూడు నెలల జీతాలు పన్ను రూపంలో చెల్లించాల్సి వస్తుండటం తో, పీఆర్సీ పెంపు ప్రయోజనాలు ఉద్యోగులకు అందడం లేదు. ఇదే ప్రస్తుతం వేతన జీవుల ఆందోళనకు కారణం అవుతుంది. **-నిజామాబాద్‌సిటీ**

అదానీ, అంబానీలను ఆదుకునే బడ్జెట్



మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

రైతులను, పేదలను దగా చేసి అదానీ, అంబానీలను ఆదుకునే బడ్జెట్‌లా ఉంది. ఉపాధిహామీ చట్టానికి గత బడ్జెట్ కంటే 30వేల కోట్లు తగ్గించి చట్టాన్ని నిర్వీర్యం చేయాలనుకోవడం సిగ్గు చేటు. చివరి బడ్జెట్ లో కూడా పసుపుబోర్డు కు మొండిచేయి చూపారు. నిజామాబాద్ ఎంపి ఎన్నికల హామీని నెరవేర్చక పసుపు రైతులను వంచనకు గురి చేశాడు. ఈ బడ్జెట్ కేటాయింపులతో తెలంగాణ పై కేంద్ర ప్రభుత్వ వివక్ష వైఖరి మరోసారి తేటతెల్లం అయ్యింది.

భవిష్యత్తుపై నిర్దిష్ట ప్రణాళికలు లేవు



ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

బడ్జెట్ లో భవిష్యత్తుపై నిర్దిష్టమైన ప్రణాళిక ఏమీ లేవు. కొత్త పథకాలు ప్రకటించకపోవడం, పాత పథకాలను విస్మరించడం వంటివి చూస్తుంటే ఏడాది తర్వాత ఈ ప్రభుత్వం వెళ్లిపోతున్నట్లు కనిపిస్తోంది. దేశ ఆర్థిక వద్ధిని నిర్దేశించని బడ్జెట్ వల్ల ఎటువంటి ప్రయోజనం లేదు. బడ్జెట్ ను మోదీ అంకెల గారడిగా అభివర్ణించారు. కరోనా సమయంలో ఎంఎస్ఎంఈలకు రూ. 20 లక్షల కోట్ల ప్యాకేజీని ప్రకటించిన మోదీ ప్రభుత్వం ఒక లక్ష కోట్లు కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. తెలంగాణకు సంబంధించి పెండింగ్ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎయిర్‌పోర్టుల వంటి ప్రాజెక్టులు ప్రకటించినా అవన్నీ ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు, బీజేపీ పాలిత రాష్ట్రాలకే మంజూరు చేస్తారని తెలిపారు. నిజామాబాద్, వరంగల్ జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుకు భూమి అందుబాటులో ఉందని, గత 9 ఏళ్లుగా కోరుతున్నా కేంద్రం పెడచెవిన పెట్టిందన్నారు. ఏయే రాష్ట్రాల్లో విమానాశ్రయాలు ఏర్పాటు చేస్తరో జాబితాను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మౌలిక సదుపాయాలకు రూ. 10 లక్షల కోట్లు కేటాయిస్తున్నామని ప్రకటించిన కేంద్రం.. వాటిని ఏ సదుపాయాల కల్పనకు ఖర్చు చేస్తారని ప్రశ్నించారు. కేవలం వారి కార్పొరేట్ మిత్రులకే వెళ్తాయా అని.. దీనిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వ్యవసాయ కూలీల వ్యతిరేక బడ్జెట్



తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం
నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్ రాములు

కేంద్ర బడ్జెట్లో ఉపాధి కూలీలని, ఉపాధి హామి రంగాన్ని, వ్యవసాయ కూలీల ప్రయోజనాలని, గ్రామీణ పేద ప్రజల ప్రయోజనాలని కేంద్రం విస్మరించింది. రోజురోజుకు అన్ని వస్తువుల రేట్లు పెరుగుతుంటే కూలీల శ్రమ రేటు మాత్రం తగ్గిస్తున్నారు. ఉపాధి చట్టం అమలుకు ప్రతి సంవత్సరం బడ్జెట్లో పెంచాల్సిన దానికి బదులుగా కేటాయింపులు తగ్గిస్తూ వస్తున్నారు. 2021 - 22 బడ్జెట్లో 98 వేల కోట్ల కేటాయించింది, దాన్ని 25 వేల కోట్లు తగ్గించి 2022 - 23 బడ్జెట్లో 73 వేల కోట్లకు తగ్గించింది, ఈ సంవత్సరం 60 వేల కోట్లు ప్రవేశపెట్టింది. కుట్రజేసీ కూలీలను బజారుపాలు చేస్తున్నారని అర్థమవుతుంది. కోతలు పెట్టడం కోసం పని విధానంలో కూడా మార్పులు చేసి ఆన్‌లైన్ ప్రవేశాలు పెట్టి ఆధార్ కార్డులో పేరు తప్పు ఉందని, బ్యాంకు పాస్ పుస్తకాల్లో ఇంకో పేరు ఉందని, జాబ్ కార్డులలో ఇంకో పేరు ఉందని ఎక్కువ సంఖ్యలో కూలీల సంఖ్యను కూడా తగ్గించింది. ఈనెపంతో బడ్జెట్లో పోవటానికి తగ్గించింది. భవిష్యత్తులో ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసే కుట్ర ఇందులో ఉందని అనిపిస్తుంది. అట్లాగే పట్టణ ప్రాంతాల్లో కూడా పని లేని నిరుపేదలకు ఉపాధి చట్టాన్ని అమలు చేయాలని అనేక సంవత్సరాలుగా కోరుతున్నా పట్టడం లేదు. ఉపాధికి రూ.2.40 లక్షల కోట్ల బట్జెట్ కేటాయించాలి. **-కంఠేశ్వర్**

విద్యారంగానికి మొండిచేయి



అరుణ్‌కుమార్. ఎస్ఎఫ్ఐ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు

2023-24 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో విద్యకు తీవ్ర మొండి చేసి చూపింది. బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం విద్యకు 10 శాతం కేటాయించవలసింది ఉంటే, కేవలం 2.6 శాతమే కేటాయించడం వల్ల కేంద్ర ప్రభుత్వానికి విద్యపై ఎలాంటి శ్రద్ధ ఉందో అర్థం అవుతుంది. ఈ బడ్జెట్‌ను సవరించి కనీసంగా పదిశాతం నిధులు కేటాయించి ప్రభుత్వ రంగ విద్యను బలోపేతం చేయాలి. **-కామారెడ్డిటౌన్**

నిరాశపరిచిన కేంద్ర బడ్జెట్



రమేశ్‌బాబు. సీపీఐ(ఎం)
నిజామాబాద్ జిల్లా కార్యదర్శి

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశ బడ్జెట్ తెలంగాణ ప్రజలపై, నిజామాబాద్ జిల్లా ప్రజల ఆశల మీద నీళ్లు చల్లేదిగా ఉంది. ఎన్నికల బడ్జెట్ అని చెప్పున్నప్పటికీ రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రత్యేకమైన నిధులను కేటాయించకపోగా రాష్ట్ర అధికారాలను తమ గుప్పెట్లో పెట్టుకునే విధంగా ఉంది. నిజామాబాద్ జిల్లా రైల్వే డబుల్ లైన్ కోసం ముంబై నుండి సికింద్రాబాద్ వరకు పూర్తి చేయటానికి కానీ, ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వే లైన్ ఏర్పాటు కొరకు గానీ బీదర్-బోధన్ రైల్వే లైన్ ఏర్పాటు కోసం గాని నిధులు కేటాయించలేదు. పసుపు బోర్డు ఏర్పాటు చేయటానికి ఏమాత్రం నిధులు కేటాయించకపోవడం జిల్లా ప్రజలను నిరాశపరచడమే. బిజెపి నాయకుల మాటలు కోటలు దాటుతున్నాయి తప్ప చేతలు గడప దాటడం లేదని మరోసారి నిరూపితమైంది. రాబోయే కాలంలో ప్రజలు బిజెపికి తగిన గుణపాఠం చెప్తారు. **-కంఠేశ్వర్**

కార్మిక వ్యతిరేక బడ్జెట్‌ను తిరస్కరించండి



నూర్జహాన్. సీఐటీయూ నిజామాబాద్
జిల్లా ప్రధాన కార్యదర్శి

2023-2024 ఆర్థిక సంవత్సరానికి మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ కార్మికులకు, రైతులకు, శ్రమ జీవులకు, ప్రజలకు పూర్తిగా వ్యతిరేకంగా ఉంది. దేశంలో ఉన్న నిరుద్యోగాన్ని పోగొట్టడానికి గానీ, పెరుగుతున్న ధరలను తగ్గించటానికి గానీ, దేశ ఆర్థిక వ్యవస్థ అభివద్ధికి గానీ ఈ అడ్జెట్ దోహదపడదు. ఇది కేవలం కార్పొరేట్ సంస్థలు, పారిశ్రామికవేత్తలు, ప్రైవేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉన్న బడ్జెట్, కార్మిక వ్యతిరేక బడ్జెట్‌ను తిరస్కరించాలని కార్మికవర్గానికి పిలుపునిస్తున్నాం. కార్మికులు దీర్ఘకాలికంగా చేస్తున్న డిమాండ్ల పరిష్కారానికి ఈ బడ్జెట్ ఎటువంటి పరిష్కారం చూపలేదు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన ఐసిడిఎస్, మధ్యాహ్న భోజనం, జాతీయ ఆరోగ్య మిషన్, జాతీయ విద్యా మిషన్, జాతీయ జీవనోపాధుల మిషన్లకు మోడీ ప్రభుత్వం కేటాయింపులు పెంచలేదు. ఆకలి సూచికలో వెనుకబడటం, పోషకాహార లోపం తదితరాలతో బాధపడుతున్న ప్రజానీకానికి బడ్జెట్ ఎటువంటి రక్షణ కల్పించలేదు. **-కంఠేశ్వర్**

నిరాశపరిచిన నిర్మలమ్మ బడ్జెట్



కే రామ్మోహన్‌రావు
పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు

మధ్య తరగతి వారిని మచ్చిక చేసుకోవాలని ప్రధాని మోడీ భావించినా, మధ్యతరగతి వర్గాలను నిరాశపరిచే విధంగా బడ్జెట్ ఉంది. మధ్యతరగతి వర్గాలకు పది లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వాలని వేతన జీవులు కేంద్ర ప్రభుత్వాన్ని అనేక సంవత్సరాలుగా కోరుతున్నారు. కానీ ఎలాంటి పన్ను మినహాయింపు లేకుండా కొత్త పద్ధతి ప్రకారం 7 లక్షల వరకు పన్ను లేదని ప్రకటించటం, మధ్యతరగతికి నిరాశపరచటమే. పాత పద్ధతి ప్రకారం గా ఆరు స్లాబులు పెట్టి 30 శాతం వరకు వేతన జీవుల వద్ద పన్ను వసూలు చేస్తూ, మరొక ప్రక్క అత్యధికంగా సంపదను పోగు చేసుకుంటున్న కార్పొరేట్లకు మాత్రం 22 శాతం పన్ను వసూలు చేయటం, ఎంతవరకు సమంజసం. **-కంఠేశ్వర్**

చిరుద్యోగులకు కాదు.. కార్పోరేట్‌లకు ట్యాక్స్ పెంచండి



తెలంగాణ సెర్ప్ ఉద్యోగుల సంఘం
రాష్ట్ర అధ్యక్షులు కుంట గంగారెడ్డి

ఆజాది క అమృత్ మహెూత్సవ పేరుతో 75 సంవత్సరాల స్వతంత్ర భారతంలో ఇంకా చిరు ఉద్యోగిపై వ్యక్తిగత పన్ను వసూలు చేయడం ఎంత మాత్రం సమంజసమం..? రూపాయి విలువ దారుణంగా పడిపోయి, అధిక ద్రవ్యోల్బణం తో ధరలు ఆకాశాన్ని అంటిన ప్రస్తుత పరిస్థితుల్లో చిరు ఉద్యోగిపై టాక్స్ భారం వేయడం సరికాదు. ఉద్యోగులకు వేతన పన్ను మినహాయింపును సంవత్సరానికి ఏడు లక్షలకు పెంచుతూ ప్రతిపాదించినప్పటికీ, 7 లక్షలు దాటిన వారికి మూడు లక్షల నుంచి ఆరు లక్షల వరకు అయిదు శాతం పన్ను, ఆరు లక్షల నుంచి 9 లక్షల వరకు 10 శాతం పన్ను విధిస్తున్నట్టుగా ప్రకటించారు. ఒక చేత్తో మినహాయింపు ఇచ్చినట్టుగానే ఇచ్చి మళ్ళీ ఏడు లక్షల దాటిన వాళ్లకు 3 లక్షల నుంచి పన్ను లెక్కించడం సరికాదు. ఆదాయ సముపార్జనే లక్ష్యం అయితే దీనికి బదులుగా కార్పొరేట్ టాక్సులను పెంచాలని కేంద్రానికి హితవు పలికారు. **-కమ్మర్‌పల్లి**

జిల్లాతో పెనవేసుకున్న
అనుబంధం మరువలేనిది

- అందరి సహకారంతోనే జిల్లాను ముందంజలో నిలుపగలిగాను
- వీడ్కోలు సమావేశంలో బదిలీపై వెళ్తున్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి వెల్లడి
- అందరినీ వదిలి వెళ్తున్నందుకు బాధగా ఉందని భావోద్వేగం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ జిల్లాలో మూడేళ్లకు పైగా విధులు నిర్వహించిన సందర్భంగా జిల్లాతో పెనవేసుకున్న అనుబంధం ఎన్నటికీ మర్చిపోలేనిది కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. కలెక్టర్ సి.నారాయణరెడ్డి వికారాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు, ఉద్యోగ సంఘాల బాధ్యులు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు, వివిధ సంఘాల బాధ్యులు కలెక్టర్ పనితీరును, ఆయనతో కలిసి పని చేసిన అనుబంధాన్ని గుర్తు చేస్తూ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ, జిల్లాను విడిచి వెళ్తుండడం బాధగా ఉన్నప్పటికీ, ఉద్యోగులకు విధుల నిర్వహణలో బదిలీలు సహజమని ఒకింత భావోద్వేగానికి లోనయ్యారు. కలెక్టర్ గా తాను జిల్లాలో బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి కింది స్థాయి ఉద్యోగి మొదలుకుని ప్రతి శాఖకు చెందిన అధికారులందరూ అన్ని విషయాల్లోనూ ఎంతగానో సహకరించారని అన్నారు. వారి తోడ్పాటు కారణంగానే జిల్లాను ధాన్యం సేకరణ, హరిత హారం, ఉపాధి హామీ వంటి అనేక అంశాల్లో ముందంజలో నిలుపగలిగానని చెప్పారు. ముఖ్యంగా పల్లె ప్రగతిని సమర్థవంతంగా అమలు చేసిన ఫలితంగా స్వచ్ఛ సర్వేక్షన్ విభాగంలో నిజామాబాద్ జిల్లా జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించగలిగిందని అన్నారు. వ్యాక్సినేషన్, క్షయ నిర్మూలనలోనూ అవార్డులు వచ్చాయని గుర్తు చేశారు. అన్నింటికి మించి కరోనా సంక్షోభంతో భయాందోళనలతో కూడిన పరిస్థితి నెలకొని ఉన్న సమయంలో అంగన్వాడీలు, ఆశ వర్కర్లు సహా వైద్యాధికారులు, సిబ్బంది పారా మెడికల్ స్టాఫ్ అహరహం శ్రమిస్తూ, ప్రజలకు తాము వెన్నంటి ఉన్నాము అనే భరోసాను కలిగించారని ప్రశంసించారు. జిల్లాకు చెందిన మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ కవిత తదితర ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లా యంత్రాంగానికి అవసరమైన అదనపు వనరులను సమకూర్చుకుని ప్రజలకు మరింత మెరు గైన సేవల ఒదించ గలి గామని కలెక్టర్ నారాయణరెడ్డి వారికి కృతజ్ఞతలు ప్రకటించారు. సర్పంచ్‌లు, ఇతర స్థానిక సంస్థల ప్రజా ప్రతి నిధులు కూడా పల్లె ప్రగతి వంటి కార్యక్రమాల్లో క్రియాశీలకంగా భాగస్వాములైన ఫలితంగానే జిల్లాకు చెందిన ఐదు గ్రామాలు జాతీయ స్థాయిలో ఉత్తమ గ్రామాలుగా ఎంపికయ్యాయని అన్నారు. ఉద్యోగులను తన కుటుంబ సభ్యులుగా భావిస్తూ, వారితో సరైన మార్గదర్శనంలో పని చేయించగలిగానని, అందరి కృషి ఫలితంగానే జిల్లా అనేక రంగాల్లో ప్రగతి సాధించగలిగిందని పేర్కొన్నారు. తాను అట్టడుగు స్థాయి నుండి పైకి వచ్చానని, తన వల్ల పది మందికి మేలు జరగాలనే తపనతో పని చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ కె.ఆర్.నాగరాజు, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, బి.చంద్రశేఖర్ తదితరులు కలెక్టర్ నారాయణరెడ్డి కలిసి పని చేసిన అనుభవాలను నెమరువేసు కున్నారు. వీడ్కోలు సమావేశంలో కలెక్టర్ సతీమణి మనీష, అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులతో పాటు జిల్లా ఉద్యోగ సంఘాల జె ఏ సి చైర్మన్ అలుక కిషన్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమణ్ రెడ్డి, ప్రభుత్వ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాములు, పీ ఆర్ టీ యూ సంఘం జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధి వి.మోహన్ రెడ్డి పాల్గొన్నారు.


కలెక్టర్ దంపతులకు గజమాలతో సన్మానం


వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

బాధ్యతలు స్వీకరించిన
కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

- స్వాగతం పలికిన జిల్లా అధికారులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌గా రాజీవ్ గాంధీ హనుమంతు బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. సాయంత్రం 4.40 గంటల సమయంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వద్దకు చేరుకున్న నూతన జిల్లా పాలనాధికారికి అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. నేరుగా తన చాంబర్‌కు చేరుకున్న కలెక్టర్ అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, బి.చంద్రశేఖర్, జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా తదితరులతో భేటీ అయ్యి జిల్లా స్థితిగతులు, స్థానిక పరిస్థితుల గురించి వారితో చర్చించారు. అంతకుముందు కొత్త కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జిల్లా పాలనాధికారిని ఆయన ఛాంబర్లో వివిధ శాఖల అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు. అదనపు కలెక్టర్లతో పాటు జెడ్పి సీ ఈ ఓ గోవింద్, డీ ఆర్ డీ ఓ చందర్, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు కలెక్టర్ కు పూల బొకేలు అందించి స్వాగతం పలికారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

తపాలా బీమా.. జీవితానికి ధీమా

నవతెలంగాణ-నిజాంసాగర్

తపాలా జీవిత బీమా పథకం ప్రారంభించి 140 సంవత్సరాలు పూర్తి అయిన నేపథ్యంలో నిజాంసాగర్ మండల కేంద్రంలో బుధవారం అధికారులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తపాలా జీవిత బీమా దేశంలోనే మొట్ట మొదటగా ప్రారంభించబడిందని, ఇదివరకు కేవలం ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే చేసుకోడానికి వీలయ్యే తపాలా జీవిత బీమా ఇప్పుడు డిగ్రీ చదివిన ప్రతి ఒక్కరూ పొందవచ్చునని కామారెడ్డి పోస్టల్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్ కుమార్ తెలిపారు. ప్రయివేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ధీటుగా తపాలా శాఖలో జీవిత బీమాకు తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్‌ను అందిస్తుందని తెలిపారు. జనవరి 1వ తేదీ నుంచి తపాలా శాఖలో డిపాజిట్‌లపై వడ్డీ రేట్లు కూడా పెరిగాయని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీపీఎం అరుణ్, భూమయ్య సర్వాన్, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ కృషితోనే పదోన్నతులు, బదిలీలు

నవతెలంగాణ-(వేల్పూర్) ఆర్మూర్

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బీమ జమున పీఆర్‌టీయూ డైరీని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గంట అశోక్, అంకం నరేష్ మాట్లాడుతూ.. పీఆర్‌టీయూ కృషి వలనే పదోన్నతులు, బదిలీలు జరుగుతున్నాయని అన్నారు. అలాగే ఉద్యోగ ఉపాధ్యాయుల కోసం ఒక శాతం ప్రీమియంతో త్వరలో హెల్త్ స్కీం అందుబాటులోకి రానుందని అన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్, ఎస్సైకి డైరీలు బహుకరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కమలాకర్, పిఆర్టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రమణారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, రాజేంద్ర, ప్రశాంత్ రెడ్డి, జిల్లా కార్యదర్శి ముత్తన్న, మండల ఉపాధ్యక్షురాలు శైలజ, తదితరులు పాల్గొన్నారు.

నూతన కలెక్టర్‌కు ఘన స్వాగతం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ నూతన కలెక్టర్ రాజీవ్‌గాంధి హనుమంతును బుధవారం ఇందల్ వాయి టోల్ ప్లాజా వద్ద డిచ్‌పల్లి, ఇందల్ వాయి తహసిల్దార్లు శ్రీనివాస్ రావు, టివి రోజ మార్యద పూర్వకంగా కలిశారు. మొక్కను బహూకరించి ఘన స్వాగతం పలికారు.



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న తహసీల్దార్

ఐలమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలి

ఒలంపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాజిరెడ్డి జగన్మోహన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తొలి దశ తెలంగాణ ఉద్యమకారిణి చాకలి ఐలమ్మ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేసి ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని ఒలింపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, ధర్పల్లి జడ్పిటిసి, జిల్లా పరిషత్ ఆర్థిక ప్రణాళిక సంఘ సభ్యులు బాజిరెడ్డి జగన్మోహన్ అన్నారు. బుధవారం మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన చాకలి సంఘం సభ్యులు ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు చాకలి ఐలమ్మ విగ్రహాన్ని నెలకొల్పడానికి సహకారం అందజేయాలని అడిగారని తెలిపారు. చెప్పినట్టుగానే విగ్రహాన్ని అందజేసినట్లు బాజిరెడ్డి జగన్ మోహన్ చెప్పారు. చాకలి ఐలమ్మ అన్యాయాన్ని ఎదుర్కొంటూ ఆనాటి ప్రభుత్వాలపై దండయాత్ర చేసి ప్రజల సమస్యలపై ప్రశ్నించిన వీర వనిత అని అన్నారు. ఆమెలో ఉన్న సహనం, ఓర్పు నేటి యువతరంలో రావాలని తెలిపారు. ఐలమ్మ బడుగ బలహీన వర్గాలకు అండగా నిలిచారని, ఆమెను స్పూర్తిగా తీసుకోవాలని సూచించారు. పశ్చిమ బెంగాల్లో సీపీఐ(ఎం) ముఖ్యమంత్రి జ్యోతిబసు బడుగు బలహీన వర్గాలకు ఎన్నో పథకాలను అమలు చేయడంతో అక్కడ ఏడోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించి ఎందరికో ఆదర్శంగా నిలిచారన్నారు. అదేవిధంగా నిజామాబాద్ రూరల్లోనూ బాజిరెడ్డి గోవర్ధన్‌కు దక్కే విధంగా చూడాలన్నారు. దానికోసమే ప్రతి ఒక్కరూ రాబోయే పరీక్షల్లో (ఎన్నికల్లో) విజయం సాధించాలంటే ముందస్తుగా ప్రజల మధ్యలో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించే విధంగా చూడాలని తెలిపారు. గ్రామల అభివృద్ధికి ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రత్యేక చొరవతో నిధులను మంజూరు చేసి అభివృద్ధి చేస్తున్నారని వివరించారు. అభివృద్ధి చేయని వారు వచ్చి ఏదో ఒకటి చెప్తే వారిని ప్రశ్నించాలని, ప్రతి ఒక్కరు సేవా దృక్పథంతో ఉండాలని బాజిరెడ్డి జగన్మోహన్ సూచించారు. అంతకు ముందు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. చాకలిసంఘ సభ్యులు పులమలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐడీసీఎం ఎస్ చైర్మన్ సాంబారి మోహన్, చాకలి సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, మండల అధ్యక్షుడు నల్లవెల్లి సాయిలు, సర్పంచ్ గడ్డం రాధాకృష్ణ రెడ్డి, ఎంపిటిసి లోక్కిడి మానస సాయి, సహకార సొసైటీ చైర్మన్ గజవాడ జైపాల్, సీనియర్ నాయకులు దాసరి లక్ష్మీనర్సయ్య, శక్కరి కొండ కృష్ణ, చింత శ్రీనివాస్ రెడ్డి సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షుడు మోహన్ రెడ్డి,అలయ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి,రూరల్ యూత్ అధ్యక్షుడు అమీర్ ఖాన్, పద్మారావు, విట్టల్ రాథోడ్, ఇర్ఫాన్, బాబా, చాకలి సంఘ ప్రతినిధులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేస్తున్న జడ్పీటీసీ జగన్, తదితరులు

గిరిజన్ హాస్టల్‌లోని సమస్యలు పరిష్కరించాలి



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ -మోపాల్

ముదక్ పల్లి గిరిజన సంక్షేమ హాస్టల్ సమస్యలు పరిష్కరించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) మోపాల్ మండల కమిటీ అధ్వర్యంలో విద్యార్థులతో ముదక్ పల్లి చౌరస్తాలో బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మండల నాయకుడు నవీన్ మాట్లాడుతూ... ఈ హాస్టల్‌లో సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మెనూ పాటించకుండా నాణ్యమైన భోజనాలు పెట్టకుండా విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నారని తెలిపారు. కిటికీ డోర్లు, బాత్రూం డోర్లు, కరెంట్ వైర్లు ఎక్కడికి అక్కడ వేలాడుతున్నాయని తెలియడంతో హాస్టల్‌కు వెళ్లి పరిశీలించామన్నారు. వెంటనే హాస్టల్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నితిన్, భాస్కర్, చరణ్, మనోహర్, నితిన్, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీ నాగరాజుకు సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణానికి చెందిన సామాజిక సేవకులకు పట్వారి తులసి కుమార్ నగర పోలీస్ కమిషనర్ నాగరాజును బుధవారం మర్యాద పూర్వకంగా కమిషనర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. సీసీగా నాగరాజు బాధ్యతలు చేపట్టి సంవత్సరం పూర్తయిన సందర్భంగా శాలువాతో సన్మా నించి, జ్ఞాపికను అందజేసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. పట్వారీ తులసి రూపొందించిన స్వాతంత్ర సమరయోధుల ఘటనల చరిత్ర పుస్తకాన్ని బహుమతిగా అందజేశారు. అనంతరం పుస్తకంలో పొందుపరిచిన అంశాలు నేటి విద్యార్థులకు ఆదర్శమని, ప్రతి ఒక్కరు చదవాల్సిన పుస్తకం అని సీపీ అన్నారు. కార్యక్రమంలో సందీప్, పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



సీపీని సన్మానించి జ్ఞాపికను అందజేస్తున్న పట్వారి తులసికుమార్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి

నవతెలంగాణ-ఆర్మూర్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, మధ్యాహ్న భోజనం కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి అన్నారు.. బుధవారం తహసీల్దార్ వేణుగోపాల్ గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... జిల్లాలో మధ్యాహ్న భోజన కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటూ బిల్లులు సక్రమంగా అందక కార్మికులు అప్పులు చేసి పథకాన్ని నిర్వహిస్తూ మానసిక శోభకు గురవుతున్నారని అన్నారు. 9, 10వ తరగతి కోడి గుడ్డు బకాయి బిల్లులు వెంటనే మంజూరు చేయాలని, పెంచిన వేతనాలను ఏప్రిల్ 20 22 నుండి అమలు చేయాలని, ప్రొసీడింగ్ ఆర్డర్ ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని, బ్యాంకుల ద్వారా కార్మికులకు ముద్ర లోన్ కింద ప్రతి పాఠశాలకు 50 నుండి లక్ష రూపాయల వరకు మంజూరు చేయాలని అన్నారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు పల్లపు వెంకటేష్, మధ్యాహ్న భోజన కార్మికులు పద్మ, కమల ,స్రవంతి, సత్యవ్వ, సాయమ్మ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

వంజరి సంఘ భూమి పూజకు తరలిరావాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షులు మాస్టర్ శ్రీనవాస్‌రావు

నవతెలంగాణ-కంఠేశ్వర్

హైదరాబాద్‌లో నిర్వహించే వంజరి సంఘ భవన భూమి పూజకు సంఘం సభ్యులు పెద్ద ఎత్తున తరలిరావాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు మాస్టర్ వంజరి శ్రీనివాస్ రావు తెలిపారు. బుధవారం నగరంలోని సంఘ కార్యాలయ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 4న వంజరి సంఘం భవన భూమి పూజ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రులు నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. భవన నిర్మాణం కోసం ఒక ఎకరం స్థలంతో పాటు కోటి రూపాయలు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కేటాయించడం పట్ల ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వంజరి సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాయావార్ సాయిరాం. పేటేరు రాజు గోపాల్, శ్రీనివాస్, కాలేరు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర ట్రస్టు సభ్యులు మాస్టర్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్ తనిఖీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో అత్యవసర పరిస్థితుల్లో సేవలు అందించే 108 అంబులెన్స్ ను బుధవారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా, నిర్మల్ జిల్లాల ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అత్యవసర పరిస్థితుల్లో సేవలు అందిం చేందుకు సిబ్బంది ఎప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గర్భిణులను ప్రసవ సమయంలో ఆసుపత్రికి అంబులెన్స్‌లోనే తరలించేలా క్షేత్ర స్థాయి వైద్య సిబ్బందితో కలిసి సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. నాణ్యమైన సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని సిబ్బందికి సూచించారు. రికార్డులు పరిశీలించి సిబ్బంది పనితీరును అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త విజయేందర్, సిబ్బంది ఈఎంటి సాగర్, పైలట్ శ్రీనివాస్ ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న మేనేజర్

మల్లన్న గుడికి మరమ్మతులు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ దులగుట్ట వద్ద గల శివ శ్రీనివాస దేవస్థానం (ఆలయ జాతర మహోత్సవం) ఈ నెల 5న కల్యాణ మహోత్సవం సందర్భంగా శ్రీ శివ శ్రీనివాస దేవస్థానం ఆలయం పక్కనగల మల్లన్న గుడికి తనవంతు సాయంగా మల్లన్న గుడిలో టైల్స్, ఇతర మరమ్మతులు ముందుకు రావడంతో ఉపసర్పంచ్ బ్రహ్మదండి సువర్ణ లింగం దంపతులకు యాదవ సంఘం పెద్దలు, కుల సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 5న జరిగే శ్రీ శివ శ్రీనివాస, మల్లన్న జాతర మహోత్సవం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు కంచు విజయ్, ఉప సర్పంచ్ బ్రహ్మదండి సువర్ణ లింగం, మాజీ కమిటీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, యాదవ సంఘ పెద్దలు కట్ట మహేష్ యాదవ్, కట్ట గోపి, ట్రాక్టర్ శ్రీకాంత్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ ఫోరం ఎన్నికలు ఏకగ్రీవం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని సీనియర్ సిటిజన్ ఫోరం జనరల్ బాడీ సమావేశం ఎన్నికలు మంగళవారం జరిగాయి. వినాయక్ నగర్ లోని కమ్యూనిటీ హాల్లో బుధవారం జరిగిన ఎన్నికల్లో వినాయక్ నగర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడిగా పీ.నర్సయ్య, కార్యదర్శిగా శ్రీహరి గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని వెల్లడించారు. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా దత్తురావు, వైస్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ పి.సత్యనారాయణరావు. ట్రెజరర్‌గా గంగాధర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా విశ్వనాథ్ గౌడ్, జాయింట్ సెక్రటరీ తోపాటు కార్యవర్గ సభ్యులును ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా రాజా గౌడ్ , విపంచి నారాయణ వ్యవహరించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన కార్యవర్గాన్ని జనరల్‌బాడీ సభ్యులంతా ఆమోదం తెలిపింది.

ఉపసర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షునిగా ప్రతాప్ గౌడ్



నవతెలంగాణ-ధర్పల్లి

ఉప సర్పంచుల సంఘం మండల అధ్యక్షునిగా దుబ్బాక గ్రామ ఉప సర్పంచ్ పిప్పెర ప్రతాప్ గౌడ్‌ను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవిని అందించిన మండలంలోని ఉపసర్పంచులకు ధన్యవాదాలు తెలిపారు. తమ సంఘ సమస్యలపై తనవంతు కృషి చేస్తానని తెలిపారు. గతంలో ఉన్న మైలారం గ్రామ ఉపాధ్యక్షుడు అధ్యక్షుడు సిమోన్ కొన్ని కారణాలవల్ల పదవినుండి తొలగిపోవడం వల్ల తిరిగి ఈ ఎన్నిక నిర్వహించినట్లు తెలిపారు. ఉపాధ్యక్షునిగా నిశాంత్, జనరల్ సెక్రెటరీగా భారత రాణి, జాయింట్ సెక్రెటరీగా లలిత శివరాం, కోశాధికారిగా కర్నాల గంగ నర్సయ్య, సభ్యులుగా ముజిత నర్సయ్య, మహేష్, నవీన్ రెడ్డి, శివరాం, సంతోష్, మోహన్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై, కానిస్టేబుల్ ఉచిత కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించిన జెడ్పీటీసీ

నవతెలంగాణ-నిజామాబాద్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకోసం ఆసక్తి చూపే నిరుద్యోగులకు మెరుగైన శిక్షణ ఇచ్చి, వారు ప్రభుత్వ ఉద్యోగాలు పొందేలా శిక్షణ ఇచ్చే కౌండిన్య పోలీస్ డిఫెన్స్ అకాడమిలో ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ సెంటర్‌ను నిజామాబాద్ జిల్లా పరిషత్ ఆర్థిక, ప్రణాళిక సభ్యులు ధర్పల్లి జడ్పిటిసి బాజిరెడ్డి జగన్ బుధవారం ప్రారంభించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో అకాడమి ప్రారంభించి ఆయన మాట్లాడుతూ ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తికి, ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేస్తున్న క్రమంలో వేల రూపాయలు ఖర్చు పెట్టి, హైదరాబాద్‌కు వచ్చి పేద అభ్యర్థులు శిక్షణ పొందలేరని అన్నారు. స్థానికంగా ఉచిత కోచింగ్ సెంటర్లు పెట్టి వారికి మెరుగైన శిక్షణ ఇప్పించాలని ముఖ్యమంత్రి కేసిఆర్ సూచన మేరకు, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సహకారంలో ఉచిత శిక్షణ ఇప్పించడం జరుగుందని అన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి దాసరి ఇంద్ర లక్ష్మీ నరసయ్య గారు, మండల బీఆర్ఎస్ పార్టీ ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు నారాయణ, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సక్కరికొండ కృష్ణ, సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కంటి వెలుగు కేంద్రం పరిశీలన

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని మునిపల్లి గ్రామంలో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని బుధవారం ఎంపీడీవో లక్ష్మణ్ పరిశీలించారు. ఎటువంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు.. ఎటువంటి కంటి అద్దాలు ఇస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో రామడుగు, జక్రాన్‌పల్లి, మునిపల్లి గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమాన్ని 217 మంది వినియోగించుకున్నారని హెల్త్ సూపర్వైజర్ అఖిల్ తెలిపారు. కార్యక్రమంలో కంటి వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.



కంటివెలుగు వివరాలు తెలుసుకుంటున్న ఎంపీడీవో

నిర్మాణరంగ కార్మికులకు పని భద్రత కల్పించాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను పెంచాలని, పని భద్రత కల్పించాలని ఇతర సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయం ఏవో ప్రశాంత్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ భవన, ఇతర నిర్మాణ కార్మికులకు మెరుగైన సంక్షేమ పథకాలను అమలు చేయాలని అన్నారు. ముఖ్యంగా పని భద్రత కల్పించాలని తెలిపారు. కార్మిక శాఖ లేబర్ కార్డులు ఇవ్వాలన్నారు. పెండింగ్ క్లెయిమ్స్ పరిష్కరించా లన్నారు. పెళ్లి కానుక, డెలివరీ పథకాన్ని 30 వేల నుండి లక్ష రూపాయల వరకు పెంచాలని తెలిపారు. సహజ మరణానికి లక్ష నుంచి 5 లక్షల రూపాయలకు, ప్రమాద వశాత్తు మరణించిన వారికి ఆరు లక్షల స్థానం నుండి 10 లక్షలకు పెంచి ఇవ్వాలన్నారు. కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ కార్మికులకు అందరికీ మోటార్ బైక్ లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లేష్, జిల్లా నాయకులు మురళి, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వరిలో అగ్గి తెగులు నివారణ చర్యలు చేపట్టాలి : ఏవో దేవిక

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

వారికి అగ్గి తెగులు సోకిందని మండల వ్యవసాయ అధికారి దేవిక అన్నారు. బుధవారం జక్రాన్‌పల్లితోపాటు మండలంలోని సికింద్రా పూర్ గ్రామంలో పొలాల సందర్శించారు. వరిలో అగ్గి తెగులు గమనించినట్టు తెలిపారు. ట్రై సైక్లోజోల్, ఐసో ప్రొతియోలిన్, ట్రై సైక్లోజోల్ మ్యాన్కోజెబ్ మరియు ట్రై సైక్లోజోల్ ప్రొఫికోనజోల్ మందులను పిచికారి చేసినట్లయితే అగ్గి తెగులును నివారించవచ్చని తెలిపారు. వాతావరణ ఉష్ణోగ్రతలు హెచ్చుతగ్గులు అవడం వల్ల నత్రజని సంబంధిత ఎరువులు అధికంగా వేయడం వల్ల తెగులు ఆశిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి వెంకటేష్ మరియు రైతులు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



మృతదేహాలను పరిశీలిస్తున్న ఎస్ఐ

నవతెలంగాణ-ధర్పల్లి

మండలకేంద్రంలోని గ్రామ శివారులో మంగళవారం అర్ధ రాత్రి సుమారు రెండు గంటల ప్రాంతంలో అదుపుతప్పి జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. పోలీసుల వివరాల ప్రకారం... ధర్పల్లి గ్రామంలోని దేశాయ్ బీడీ కంపెనీలో ప్యాకర్‌గా గన్నారం గ్రామానికి చెందిన ఎరుగు శ్రీనివాస్ (45), బలవత్రి కృష్ణ (48) ఇద్దరు పని చేసేవారు. మంగళవారం ఆలస్యం కావడంతో తోటి స్నేహితుడిని వాల్గొట్ గ్రామంలో దించి వచ్చేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో గ్రామ శివారులోని కోళ్ల ఫోరం సమీపంలోని మూలమలుపు వద్ద బైక్ అదుపు తప్పి ఇద్దరు మృతి చెందారు. మృతుడు కృష్ణ భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వంశీ కృష్ణ రెడ్డి తెలిపారు.

ఖిల్లా డిచ్‌పల్లిలో అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని ఖిల్లా డిచ్ పల్లి గ్రామంలో శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవాలయ బ్రహోత్సవాల్లో భాగంగా బుధవారం అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గడ్డం రాధాకృష్ణ రెడ్డి, మనుమడు నితిన్ రెడ్డి మనుమరాలు నవనీత్ రెడ్డి అధ్వర్యంలో తల్లిదండ్రులు కీర్తిశేషులు గడ్డం లక్ష్మీబాయి, రాములు పేరుపై అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గడ్డం రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రుల పేరు మీద ప్రత్యేక బ్రహ్మోత్సవాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తానని, ఇదే కాకుండా ఇంకా ఆరో రోజులపాటు ఒక్కొక్కరు అన్నదానం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రణాళికా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ధర్పల్లి జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎంఎస్ చైర్మన్ సాంబార్ మోహన్ గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏసీడీ, ఇతర సర్వీస్ చార్జీలను రద్దు చేయాలి

ఏఐఎస్‌బీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రజలపై భారాలు వేస్తున్న విద్యుత్ సర్వీస్ ఏసీడీ, ఇతర సర్వీస్ చార్జీలను రద్దు చేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి రాజుగౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజలపై విద్యుత్ అదనపు (ఏసీడీ)చార్జీల పేరుతో భారాలు మోపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విద్యుత్ వినియోదారులపై ఏసీడీ చార్జీల పేరిట 12నెలలకు ఒకసారి బిల్లు మొత్తాన్ని లెక్కించి అదనంగా 3 నెలలకు సమానంగా డబ్బు వసూలు చేయడానిన తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇంటి, కరెంట్ బిల్లులు అడ్డగోలుగా పెంచుకున్న ప్రభుత్వం మళ్ళీ ఏసీడీ పేరిట వసూలు చేయడం వినియోగదారులను పీడించడమే అవుతుందన్నారు.

రాజ్ గోపాల్ రెడ్డికి సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

బీజేపీ ఆదిలాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశానికి వెల్తూ మార్గమధ్యలో పట్టణంలోని ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ అల్జాపూర్ శ్రీనివాస్ గృహానికి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బుధవారం విచ్చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా నాయకులు పల్లె గంగారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు, పట్టణ అధ్యక్షులు జెస్సు అనిల్ కుమార్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.



ఆలయంలో జండా ఆవిష్కరణ

నవతెలంగాణ-సిరికొండ

మండలంలని హుస్సేనగర్ గ్రామంలో మహా జ్ఞానసరస్వతి మందిరంలో బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ప్రధాన ఆలయ అర్చకులు తేజశ్రీప్రమోద్ నిర్వహించి అర్చన చేశారు. ఆలయ హుండీని తెరిచారు. తదుపరి యజ్ఞం నిర్వహించారు. ఈనెల 4 వరకు యజ్ఞం జరుగుతుందని, ఐదో రోజున హెూమం అనంతరం నుండి అన్నసత్రం, జాతర ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ చైర్మన్ పాల్గొన్నారు.

బోరు బావికి భూమిపూజ



బోరుబావికి భూమిపూజ చేసిన ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని వేంపల్లి గ్రామంలోగల శివాలయంలో జడ్పీటీసీ నిధులతో బోరు బావికి సర్పంచ్ జక్క మల్లుబాయి గంగాధర్‌తో కలిసి జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సవ్వ నర్సారెడ్డి బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వేంపల్లి సొసైటీ ఛైర్మన్ జక్క రాజేశ్వర్, జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సవ్వ నర్సారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సామ వెంకట్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు జోషి వెంకట్ రాజ్, ఆలయ కమిటీ ఛైర్మన్ దేశ నర్సయ్య, పార్టీ గ్రామ అధ్యక్షులు గంగాధర్, మాజీ ఉప సర్పంచ్ ఎట్టెం మహేష్, చిట్టి పటేల్, పార్టీ కార్యకర్తలు, శివ భక్తులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

దోమకొండలో మన ఊరు మనబడి పనులు ప్రారంభం

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని పలుగడ్డ ప్రాథమిక పాఠశాలలో మన ఊరు మనబడి కార్యక్రమాన్ని జడ్పీటీసీ తీగల తిరుమలగౌడ్, ఎంపీపీ కానుగంటి శారద బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శారదా, జడ్పీటీసీ తీర్మాల్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు మనబడి కార్యక్రమం ఎంతో అభినందనీయమన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకై ప్రభుత్వం విద్య రంగానికి పెద్దపీట వేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గంద్ర మధుసూదన్ రావు, ఎంపీపీ కానుగంటి శారద నాగరాజు, సర్పంచ్ నల్లవు అంజలి శ్రీనివాస్, విండో చైర్మన్ నాగరాజు కుంచాల శేఖర్, కదారి రమేష్, రావులపల్లి నర్సారెడ్డి, ఉపసర్పంచ్ శ్రీకాంత్, కిషన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


చేపల వేటకు వెళ్లి ఒకరు మృతి

నవతెలంగాణ-లింగంపేట్

చేపల వేటకు వెళ్లి ఒకరు మృతిచెందారు. ఈ ఘటన మండలంలోని ఒంటరిపల్లి గ్రామానికి చెందిన పెద్ది శివయ్య (51) ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామ శివారులో గల చెరువులో చేపలు పట్టడానికి భార్యతో కలిసి వెళ్లాడు. అక్కడ తన భర్త చెరువులో రెండు దిక్కుల గాలం వేసి.. భార్యను ఇంటికి వెళ్లమన్నాడు. అయితే రాత్రి ఏడు అయినప్పటికీ తన భర్త తిరిగి రాకపోయేసరికి సాయవ్వ చెరువు దగ్గరికి వెళ్లి చూసేసరికి అక్కడ తన భర్త కనిపించలేదు. టీవీ ఎక్సెల్, దుస్తులు మాత్రమే ఉన్నాయి. బుధవారం ఉదయం చెరువులో గాలించగా.. మృతదేహం దొరికింది. మృతుని భార్య సాయవ్వ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

నేటి నుంచి బడాపహాడ్ ఉర్సు

- మతసామరస్యరానికి ప్రతిక.. పెద్దగుట్ట
- పలు రాష్ట్రాల నుంచి ప్రజలు రాక
- చెల్లని నాణేలే భిక్షకులకు జీవనాధారం



పెద్దగుట్ట

నవతెలంగాణ-వర్ని

వర్ని మండలంలోని జలాల్‌పూర్ గ్రామ శివారులో బడాపహాడ్ (పెద్దగుట్ట) దర్గా సయ్యద్ షాదుల్లా హుస్సేన్ బాబా ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు అందుకు అన్నీ ఏర్పాట్లు చేశారు.

70 ఏండ్ల చరిత్ర కలిగి ఉన్న సయ్యద్ షాదుల్లా బాబా బడాపహాడ్ దర్గా వర్ని నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ దర్గాకు మొక్కులు చెల్లించుకోవడానికి హిందువులు, ముస్లింలు, సిక్కులు, పలు మతాలకు చెందిన వారు వస్తూ ఉంటారు.

'సయ్యద్ షాదుల్లా బాబా మహారాష్ట్ర జహంగీర్ అనే మహారాజు వద్ద (గుమస్తాగా) పన్ను వసూలు చేసే ఉద్యోగం చేసేవాడు. అప్పటి రోజుల్లో ఆ ప్రాంతంలో పెద్ద కరువు రావడంతో షాదుల్లా బాబా పేద ప్రజల నుంచి పన్ను వసూలు చేయకుండా రాజంలో ఉన్న ఖజానాను పేద ప్రజలకు పంచి పెట్టి ఆదుకున్నాడు. ఆ విషయం తెలుసుకున్న జహంగీర్ మహారాజు బటులను పంపించి చెరసాలకు తీసుకురమ్మని ఆదేశించడంతో.. తన వద్దకు బటులు వస్తున్నారని తెలుసుకున్న సయ్యద్ షాదుల్లా బాబా తనకు తోడుగా ఉన్న గుర్రం, కుక్క, పిల్లిని వెంట తీసుకొని బడాపహాడ్ (పెద్దగుట్ట)లోకి వచ్చాడు. ఈ గుట్ట ప్రాంతంలోని గొల్ల సాయమ్మ తన మేకల మందను కాయడానికి వస్తూ ఉండేది. అప్పుడు షాదుల్లా బాబా ఉన్న ప్రాంతానికి సాయమ్మ రావడంతో ఆమెను దాహం తీర్చమని అడగగా.. ఆమె పాలు పోసి దాహం తీర్చారు. ఇలా ప్రతి రోజు షాదుల్లా హుస్సేన్ బాబాకు పాలు, పెరుగు తీసుకుని వెళ్ళేది. ఈ విషయం తెలుసుకున్న జహంగీర్ మహారాజు తన సైన్యాన్ని పెద్దగుట్ట అడవికి పంపించి గొల్ల సాయమ్మ రహస్యంతో ఆమె వెనకాల సైన్యం వెళ్లింది. సైన్యానికి చిక్కకుండా సయ్యద్ షాదుల్లా బాబా తన కర్రతో గుర్రం, కుక్క, పిల్లిని కొట్టడంతో అవి జీవసమాధి కాగానే.. సయ్యద్ షాదుల్లా బాబా కూడా భూమిని కర్రతో కొట్టి సమాధి అయ్యారు. ఇది చూసిన సైనికులు ఈ విషయాన్ని జహంగీర్ మహారాజుకు తెలుపడంతో జహంగీర్ మహారాజు పశ్చాతాపపడి బాబా షాదుల్లా మహత్యానికి మొక్కులు చెల్లించి సమాధిని కట్టించినట్టు' ఇక్కడి ప్రజలు చెబుతున్నారు.

కందుర్లు ప్రారంభం..

పెద్దగుట్ట అడవిలోకి గిరిజన వ్యక్తి తన ఆవుల మందను మేపడానికి వచ్చి కొంచెం నిద్రపోవడంతో నిద్ర మేలుకొనేలోపు ఆవులు మాయమవడంతో అక్కడే ఉన్న షాదుల్లా హుస్సేన్ బాబా దర్గా వద్ద 'తన ఆవులు మళ్లీ దొరకాలని.. దొరికితే పూజలు చేస్తానని మొక్కుకున్నాడు. అంతలో తన ఆవులు దొరకడంతో తన బంధువులకు, స్నేహితులకు, గ్రామస్తులకు ఆహ్వానం పలికి దర్గా వద్ద కందూర్ చేశాడు. అప్పటి నుంచి అక్కడ వచ్చే భక్తులు కందూర్లు చేస్తూ ఉంటారు.

ఇతర రాష్ట్రాల ప్రజలు..

తెలంగాణ రాష్ట్ర ప్రజలే కాకుండా.. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌తో పాటు పలు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పెద్దగుట్టకు వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ప్రతియేటా భారీ ఎత్తున భక్తులు పెరుగుతుండటంతో ప్రభుత్వం పెద్దగుట్ట షాదుల్లా బాబా దర్గాను స్వాధీనం చేసుకుంది.

చెల్లని నానాలే ఫకీర్లకు జీవనాధారం..

పెద్దగుట్ట దర్గా వద్దకు పైకి వెళ్లడానికి 1000 మెట్లు ఎక్కవలసి ఉంటుంది. షాదుల్లా బాబా దర్గా వద్దకు పైకి ఎక్కే సమయంలో మెట్లకు ఇరువైపులా ఫకీర్లు భిక్షం కోసం కూర్చుంటారు. అయితే భక్తులు రూ.10 చెల్లించి చెల్లని నాణేలను కొని.. దర్గా వద్దకు వెళ్లే క్రమంలో ఫకీర్లకు భిక్షమేస్తుంటారు. వచ్చిన నాణేలను ఫకీర్లు అక్కడే బదిలీ చేసుకుని జీవనం కొనసాగిస్తుంటారు. ఎక్కడా దొరకని నాణేలు ఇక్కడ దొరకడం ప్రత్యేకం.

బడాపహాడ్‌లో రెండో రోజు శానిటేషన్

బడాపహాడ్‌లో ఉర్సు ఉత్సవాలు గురువారం ప్రారంభమవుతున్న నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా రెండవ రోజు బుధవారం గ్రామపంచాయతీ కార్మికులచే పూర్తిస్థాయిలో శానిటేషన్ చేయించారు. మేకలు కోసేచోట, మురుగు కాలువలలో, దోమలు లకు శానిటేషన్ చేస్తూ పిచికారి చేయించారు. భక్తులకు అన్ని విధాలా సౌకర్యాలు కల్పిస్తున్నామని సర్పంచ్ పేర్కొన్నారు. వ్యాపారస్తులు స్టాల్ కూడా ఏర్పాటు చేసుకునే వారికి జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీవో, సర్పంచ్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు బడాపహాడ్‌కు స్పీకర్ రాక

మండలంలోని జలాల్‌పూర్ గ్రామ శివారులో గల పెద్ద గుట్ట ఉర్సు ఉత్సవాలకు తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా గురువారం విచ్చేస్తున్నట్టు మండల అధ్యక్షులు, కోఆప్షన్ మెంబర్ ఖరీం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జలాల్‌పూర్ నుంచి ప్రారంభమయ్యే ఉర్సు ఉత్సవాలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

పంటలకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

- జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి



పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

నవతెలంగాణ-గాంధారి

వరి, మొక్కజొన్న పంటలలో రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని ముద్దెల్లి, సర్వాపూర్ గ్రామాలలోని వరి, మొక్కజొన్న పంటలను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నరేష్, ఏఈఓ దీక్షిత్, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇండ్ల స్థలాల కోసం నేడు ధర్నా

- పేదలు పెద్దఎత్తున తరలిరావాలి : సీఐటీయూ

నవతెలంగాణ-ఎడపల్లి

నిరుపేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గురువారం ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సీఐటీయూ ఎడపల్లి మండల కన్వీనర్ జంగం గంగాధర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిరుపేదలు ఈ కార్యక్రమానికి తరలిరావాలని కోరారు.

నేడు బిచ్కుంద మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-బిచ్కుంద

మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అశోక్ పటేల్ అధ్యక్షతన గురువారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఆనంద్ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జుక్కల్ శాసనసభ్యులు, అసెంబ్లీ ప్యానల్ స్పీకర్ హనుమంత్ షిండే హాజరవుతారని ఆయా శాఖలకు చెందిన అధికారులు పూర్తి నివేదికలతో సరైన సమయానికి సమావేశానికి హాజరుకావాలని కోరారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-ఎడపల్లి

ఆర్థికంగా ఆపదలో ఉన్న, అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబాలను ఆదుకోవడమే డైహార్డ్ ఫౌండేషన్ లక్ష్యమని స్థానిక సర్పంచ్ కోల ఇంద్రకరణ్ స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని పోచారం గ్రామానికి చెందిన చాకలి చిన్న గంగారాం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబానికి రూ.6వేల నగదును, అలాగే అదే గ్రామానికి చెందిన ఒడ్డెట్టి (గుండ్ల) శ్రీనివాస్ కుటుంబానికి 13,100వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని డైహార్డు ఫౌండేషన్ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో విజయ్, సుదర్శన్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్‌లోని గుండ్ల వార్డు, మేదర్‌గల్లీలో సర్పంచ్ వికార్‌పాషా, ఎంపీటీసీ ఎస్.కె అహమ్మద్ సీసీ రోడ్డు పనులను బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లతా సాయిలు, పాలకవర్గ సభ్యులు కంఠం గంగారం, శ్రీకాంత్, సంతోష్, నాయకులు హాజీఖాన్, చంద్రశేఖర్, బి.సాయిలు, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన బోధన్ సహాయ సంచాలకులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కల్యాపూర్ గ్రామంలో నాగరాజు అనే రైతు పొలాన్ని బోధన్ వ్యవసాయ సహాయ సంచాలకులు సంతోష్ బుధవారం పరిశీలించారు. తన పంట పొలంలో మొగి పురుగు సోకిందని, దాని నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మండల కేంద్రమైన రెంజల్‌లో శివగంగ ఫర్టిలైజర్ దుకాణాన్ని ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి పంటల నమోదు కార్యక్రమం రికార్డులను పరిశీలించారు.

సోయా, వరి పంటల పరిశీలన

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని కేమ్రాజ్‌కల్లాలీ గ్రామంలో యాసంగి వరి, సోయా పంటలను మండల వ్యవసాయాధికారి నవీన్‌కుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. గ్రామ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు సంతోష్ పటేల్, రైతులు బాలరాజు, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో బీఆర్ఎస్ పార్టీకి షాక్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ సర్పంచులు బీఆర్ఎస్ నుంచి టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ మదన్‌మోహన్ రావు ఆధ్వర్యంలో కామారెడ్డి కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో బుధవారం చేరారు. రుద్రారం సర్పంచ్ సత్తయ్య, సాతెల్లి సర్పంచ్ సంగమేశ్వర్, మాచాపూర్ నాయకులు సుధాకర్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. వీరికి మదన్ మోహన్ రావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి కాంగ్రెస్ నాయకులు అరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని రామేశ్వర్‌పల్లి వడ్డెర సంఘ నూతన కార్యవర్గాన్ని బుధవారం సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షునిగా గంగాధర్, ఉపాధ్యక్షుడిగా వెంకట్, కార్యదర్శిగా వినోద్ కుమార్, సహాయ కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా సంతోష్ కుమార్, సలహాదారులుగా మల్లేశం, శంకరయ్య, మధుసూదన్, మహిపాల్, రాజ్యం, డైరెక్టర్లుగా మోహన్, శశికుమార్, మహేష్, ఆనంద్, రాజు, సభ్యులు మహేష్‌బాబు, మనీష్, భరత్‌ను ఎన్నుకున్నారు.

జీపీల్లో కొత్త భవనాలుకు నిధులు మంజూరు

- 26 నూతన జీపీలకు భవనాల మంజూరి

నవతెలంగాణ-బోధన్/రామారెడ్డి/రెంజల్

బోధన్ నియోజకవర్గంలోని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసినట్టు పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే నియోజకవర్గంలోని 26 నూతన గ్రామపంచాయతీలకు 20 లక్షల చొప్పున 5.20 లక్షల రూపాయలను గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్టు మంత్రి వెల్లడించారు. అలాగే ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా సీసీ రోడ్ల నిర్మాణాలకు 1420 లక్షల రూపాయలు మంజూరి చేసినట్టు ఉత్తర్వులలో పేర్కొన్నారు. అందులో భాగంగా బోధన్ మండలానికి 3.85 లక్షలు, నవీపేట్ మండలానికి 6.50లక్షలు, రెంజల్ మండలానికి 1.75 లక్షలు, ఎడపల్లి మండలానికి 2.10లక్షలు, నవీపేట్ మండలం పోతంగల్ గ్రామానికి 1.30 లక్షలు మంజూరయ్యాయి. బోధన్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులలో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణాలకు, నూతన గ్రామపంచాయతీ భవనాలకు నిధులు మంజూరు చేసిన పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ కృతజ్ఞతలు తెలిపారు.

గొడుగు మర్రి పంచాయతీకి రూ.3.17కోట్ల బీటీ రోడ్డు మంజూరు..

రామారెడ్డి : గొడుగు మర్రి గ్రామపంచాయతీ పరిధిలో రోడ్ల అభివృద్ధికి రూ.3కోట్ల 17లక్షల బీటీ రోడ్డు మంజూరు కావడంతో తండావాసులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం అన్నారం బస్టాండ్‌లో టపకాయలు కాల్చి, ముఖ్యమంత్రి కేసీఆర్, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పరమేష్ మాట్లాడుతూ..



రామారెడ్డి : చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

గిరిజనుల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, తాండాలను గ్రామ పంచాయతీలుగా చేసి, అభివృద్ధికి నిధులు కేటాయించడం ప్రభుత్వ పనితనానికి నిదర్శనమని అన్నారు. గొడుగు మర్రి గ్రామపంచాయతీ పరిధిలో సున్నపురాళ్ల తండా, గొడుగు మర్రి తాండ, మొండి వీరన్న తండాల రోడ్లకు స్థానిక ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి సహకారంతో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ గ్రామ పంచాయతీకి భారీ నిధులను కేటాయించి గ్రామపంచాయతీ అభివృద్ధికి తోడ్పడినందుకు, గంప గోవర్ధన్‌కు రుణపడి ఉంటామని, తాండ వాసుల తరపు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గడ్డం చంద్రకళ గంగారెడ్డి, అన్నారం ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్ స్వామిగౌడ్, నాయకులు కూడెల్లి బాలరాజు, కుక్కల రాజయ్య, పీర్‌సింగ్ నాయక్, పరశురాం నాయక్, రామ్ చందర్ నాయక్, లచ్చిరాం నాయక్, మోతి సింగ్ తండావాసులు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు జీపీ భవనాలకు నిధులు మంజూరు..

రెంజల్ : మండలంలోని బోర్గం, మౌలాలి తాండ, దండిగుట్ట, వీరన్నగుట్ట తాండ, గ్రామాలకు రూ.20లక్షల చొప్పున జీపీ భవనాలకు నిధులు మంజూరైనట్టు తెలిసింది. స్థానిక ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ అమీర్ అభ్యర్థన మేరకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి నిధులను మంజూరు చేశారు. సీసీ డ్రైనేజీల కోసం అంబేద్కర్ నగర్ ఐదు లక్షలు, బాగేపల్లి ఐదు లక్షలు, బోర్గం 20 లక్షలు, దండిగుట్ట ఐదు లక్షలు, దూపల్లి పది లక్షలు, కళ్యాపూర్ 10 లక్షలు, కందకుర్తి 20 లక్షలు, కిసాన్‌తాండా ఐదు లక్షలు, కునేపల్లికి ఐదు లక్షలు మంజూరైనట్టు తెలిసింది.

ఆలయ చైర్మన్‌గా నియామకపత్రం అందించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని పురాతన ఏక చక్రేశ్వర శివాలయం చైర్మెన్‌గా బీర్కూర్ శంకర్‌కు నియమిస్తూ బుధవారం బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ నియామకపత్రాన్ని అందజేశారు. ఆలయ అభివృద్ధికి పాటుపడాలని, పండుగల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేయడంలో కృషి చేయాలని ఎమ్మెల్యే నూతన చైర్మన్‌కు సూచించారు. తనపై నమ్మకంతో ఏకచక్రేశ్వర కమిటీ చైర్మన్‌గా నియమించినందుకు ఆయన ఎమ్మెల్యే షకీల్ అమీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే సహకారంతో కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అంగిటే లక్ష్మణ్ పటేల్, రుద్ర సత్యం, గుమ్మల శంకర్ రెడ్డి ఉన్నారు.

రాష్ట్రస్థాయి ఈఎల్టీఏకు ఎంపికైన రెడ్డిపేట విద్యార్థిని



విద్యార్థిని సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రెడ్డిపేట జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఎనిమిదవ తరగతి విద్యార్థిని అక్షయ ఈఎల్‌టీఏ స్టోరీ టెల్లింగ్‌లో జిల్లా స్థాయిలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైనందుకు విద్యార్థిని సన్మానించి బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బస్వరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో మట్టిలో మాణిక్యాన్ని వెలికి తీయవచ్చునని.. అక్షయ నిదర్శనమని, విద్యార్థులు అక్షయను ఆదర్శంగా తీసుకొని మంచి ప్రతిభను కనబరచాలని విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాజాగౌడ్, ఎస్ఎంసీ చైర్మన్ శంకర్, ప్రధానోపాధ్యాయులు బస్వరాజ్, బీఆర్ఎస్ నాయకులు ప్రభాకర్‌రావు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-సదాశివనగర్

నానో యూరియాను రైతులు సాగు చేస్తే.. మెరుగైన పంట దిగుబడి వస్తుందని ఇఫ్కో కంపెనీ జనరల్ మేనేజర్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం సదాశివనగర్ మండలంలోని పద్మాజివాడి రైతు వేదిక భవనంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు వరి పంటలకు యూరియా వినియోగించడం వల్ల కేవలం 30 శాతం మాత్రమే పనిచేస్తుందని, కానీ నానో యూరియా వాడడం వల్ల అధిక దిగుబడి వస్తుందన్నారు. నానో యూరియా, యూరియాకు గల వ్యత్యాసాన్ని వివరించారు. నానో యూరియా రసాయన రూపంలో ఉండడం వల్ల పిచికారీ చేయడంతో పంటకు బాగా ఉపయోగపడుతుందన్నారు. నానో యూరియా రవాణా ఇబ్బందులు కూడా తక్కువేనన్నారు. కార్యక్రమంలో పద్మాజివాడి సహకార సొసైటీ చైర్మన్ గంగాధర్, వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, మండల వ్యవసాయాధికారి ప్రజాపతి, ఏఈవో లక్ష్మి కృపాకర్, నరేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో మూడు ట్రాక్టర్లు, జేసీబీ

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా శివారులో అక్రమంగా మొరం, మట్టిని తరలిస్తున్న మూడు టాక్టర్లు, ఒక జేసీబీని స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్టు ఎస్సై సాయన్న తెలిపారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా మొరం తరలిస్తున్న వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి తహసీల్దార్‌కు హ్యాండోవర్ చేసినట్టు తెలిపారు.

ఫైలేరియా బాధితులకు వస్తువులు పంపిణీ

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రంలో ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వస్తువులను సర్పంచ్ లక్ష్మీ రాజలింగం బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫైలేరియా వ్యాధి పట్ల ప్రజలు నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఐదు రకాల వస్తువులు ఉచితంగా అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బాలగోని రాజాగౌడ్, ఎంపీటీసీ కోడూరి సాయగౌడ్, వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది రేణుక, ఆశావర్కర్లు, వ్యాధిగ్రస్తులు పాల్గొన్నారు.



వస్తువులు పంపిణీ

నివారణ వస్తువుల పంపిణీ..

అలాగే మండల కేంద్రంలోని స్థానిక ఆరోగ్య ఉప కేంద్రంలో ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న నివారణ వస్తువులను ఏఎన్ఎం శ్యామల వ్యాధిగ్రస్తులకు పంపిణీ చేశారు. ఆశా వర్కర్లు సంతోషి, వనజ, రేణుక, సుకన్య, లావణ్య, కవిత పాల్గొన్నారు.

కంచర్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని కంచర్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని మంగళవారం రాత్రి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా సాయగౌడ్, ఉపాధ్యక్షునిగా మహేందర్, యువజన అధ్యక్షునిగా నరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మహేందర్, బీసీ సెల్ అధ్యక్షునిగా నవీన్, కిసాన్‌సెల్ అధ్యక్షునిగా మహేందర్, ఎస్సీ సెల్ అధ్యక్షునిగా రాకేష్, మహిళా అధ్యక్షురాలిగా భారతమ్మ, హెల్త్ ఇన్సూరెన్స్ ఆన్‌లైన్ అధ్యక్షుడిగా శ్రీకాంత్ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని సూచించారు.

కుక్కల దాడిలో దూడ మృత్యువాత

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని మున్నూరు కాపు వీధిలో బుధవారం కుక్కల దాడిలో దూడ మృత్యువాతపడింది. ఈ ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన భాజకాంతంకు చెందిన దూడను వీధి కుక్కలు గాయపరచగా మృత్యువాతపడింది.

భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా మెమోరియల్ క్రీడాపోటీలు

నవతెలంగాణ-వర్ని

భగత్‌సింగ్ 72వ వర్ధంతి సందర్భంగా ఈనెల 4,5 తేదీలలో మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల మైదానంలో ప్రగతిశీల విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో భగత్‌సింగ్ మెమోరియల్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు పీడీఎస్‌యూ కార్యదర్శి కార్తీక్ తెలిపారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కబడ్డీ, కోకో, వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ క్రీడలలో అధికంగా పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో విగ్నేష్, గోపాల్, ప్రశాంత్, ప్రదీప్, నాని తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర వృత్తిదారుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-భిక్కనూర్

వడ్డెర వృత్తిదారుల సంఘం నూతన క్యాలెండర్‌ను సర్కిల్ కార్యాలయంలో సీఐ తిరుపయ్య చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని, అందరూ స్నేహాభావంతో కలిసిమెలిసి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వడ్డెర వృత్తిదారుల జిల్లా ప్రధాన కార్యదర్శి సూర రాజు, మండలాధ్యక్షుడు కొమ్మ రాజుల శ్రీనివాస్, రాష్ట్ర మీడియా కో కన్వీనర్ ఆనంద్, ఐలయ్య, రాములు, కళ్యాణ్, అనిల్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి 4
గురువారం 02 ఫిబ్రవరి 2023

జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని కుర్నాపల్లి సర్పంచ్ దుబ్బాక సావిత్రి భర్త రవీందర్ గౌడ్ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు వెంకటేశ్వర దేశాయ్, ఎడపల్లి మండల ప్రజాప్రతినిధులు, అధికారులు రవీందర్‌గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

కేమ్రాజ్‌కల్లాలీలో అన్నప్రాసన



నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని కేమ్రాజ్‌కల్లాలీ మోడల్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అన్నప్రాసనం, అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని టీచర్ రాధా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఉప సర్పంచ్ సాయవ్వ, ఎంపీపీఎస్ పాఠశాల చైర్మెన్ సుంకరి శంకర్ హాజరయ్యారు. అలాగే సావర్‌గావ్ అంగన్‌వాడీ సెంటర్‌లో స్థానిక సర్పంచ్ కిషన్ చేతుల మీదుగా పౌష్టికాహారం అందించారు. సర్పంచ్‌తో పాటు జేపీఎస్, టీచర్ బుజ్జిబాయి తదితరులు పాల్గొన్నారు.

స్వరాష్ట్రంలోనే పల్లెల అభివృద్ధి

- జిల్లా జడ్పీ చైర్పర్సన్ దఫేదర్ శోభ రాజు

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని నర్వ గ్రామంలో మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా మౌలిక వసతులతో తీర్చిదిద్దిన ప్రభుత్వ పాఠశాలను ప్రారంభించేందుకు ముఖ్య అతిథిగా జిల్లా జడ్పీ చైర్పర్సన్ దఫేదర శోభ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వరాష్ట్రంలోనే పల్లెలు ఎంతగానో అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. సిఎం కేసీఆర్ విద్య, వైద్య రంగాన్ని మెరుగు పరిచి ప్రజలకు ఆరోగ్య తెలంగాణ అందించాలని కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలో మొత్తం 16 పాఠశాలలు మన ఊరు మన బడి కార్యక్రమానికి ఎంపిక కాగా మొదటగా నర్వ గ్రామంలో రూ.5.60 లక్షలతో పనులు పూర్తి చేసుకుని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. నర్వ గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు కావడంతో శంకుస్థాపన చేశారు.



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ దఫేధర్ శోభరాజు

మాకు కూడా దళిత బంధు ఇవ్వాలి : మండల చిరు ఉద్యోగస్తుల వినతి

నిజాంసాగర్ మండలం దళిత బందు పథకం పైలెట్ ప్రాజెక్ట్‌గా రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేయడంతో మండలంలో ఇప్పటికే దళిత బందు పథకం యూనిట్లను అందజేశారు. ఇదిలా ఉండగా చిరు ఉద్యోగస్తులకు కూడా దళిత బందు పథకం వర్తింపజేస్తమని ప్రభుత్వం చిరు ఉద్యోగస్తుల వివరాలు సేకరించి, అర్హులను గుర్తించి జాబితాను జిల్లా ఉన్నతాధికారులకు అందజేశారు.

దీంతో దళిత బందు పథకం యూనిట్ల పంపిణీ కార్యక్రమం నిధులు లేక తాత్కాలికంగా నిలిపివేయడంతో నిధులు మంజూరు చేసి మాకు కూడా దళిత బందు పథకం యూనిట్లను అందజేయాలని వినతి పత్రాన్ని జిల్లా జడ్పీ చైర్పర్సన్ దఫెదర్ శోభ రాజు కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు పట్లోళ్ల జ్యోతి దుర్గారెడ్డి, వైస్ ఎంపిపి మనోహర్, జిల్లా విద్యాధికారి రాజు, సర్పంచ్ సంగమని రాములు, నాయకులు గంగారెడ్డి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి చట్టం నిర్వీర్యానికి కుట్ర

- సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



ఉపాధి పనికి బడ్జెట్లో భారీగా నిధులు తగ్గించారు. 2005వ సంవత్సరంలో కాంగ్రెస్ యుపిఎ-1 ప్రభుత్వంలో 66 మంది కమ్యూనిస్టు పార్టీల ఎంపీలు మాకు మంత్రి పదవులు వద్దు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు పట్టణాలకు వలసలు వెళ్లి పనులు లేక ఇబ్బందులకు గురవుతున్నారని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల వలసలను ఆపాలని వారి స్థితిగతులలో మార్పులు తెచ్చేందుకు ఆర్థికంగా ఎదగడానికి గ్రామాల్లోనే ఉపాధి పనులు కల్పించేలా చట్టాన్ని తీసుకురావాలని ఒత్తిడి తీసుకొస్తే ఈ చట్టం కార్యరూపం దాల్చినట్టు గుర్తుచేశారు. ఈ చట్టానికి గత బడ్జెట్లో 98 వేల కోట్లు కేటాయిస్తే, ప్రస్తుత బడ్జెట్లో భారీగా నిధులు తగ్గించి 60 వేల కోట్లు కేటాయించడం వల్ల ఉపాధి పనులు దెబ్బతింటాయని అన్నారు. దేశానికి వెన్నుముక అయినా వ్యవసాయ రంగానికి బడ్జెట్లో నామమాత్రపు కేటాయింపులే ఉన్నాయని, విద్యా -వైద్య రంగానికి బడ్జెట్లో కేటాయింపులు లేవని అన్నారు, వీటితోపాటు రైల్వేలో సికింద్రాబాద్ -ముఖేడ్ రెండవ రైల్వే లైన్ ,బోధన్-బీదర్ రైల్వేలైన్‌కు బడ్జెట్ కేటాయించకపోవడం అన్యాయమని అన్నారు.

ఆదాయపు పన్ను పరిమితి రూ.10 లక్షలకు పెంచాలి

- ఎడ్ల నాగరాజు. మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

కేంద్ర బడ్జెట్లో ఉద్యోగులకు 2.5 నుండి 7 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు కొంతవరకు ఊరట కలిగించింది. ఇప్పుడున్న పరిస్థితులను బట్టి పది లక్షల వరకు పెంచితే ఉద్యోగులకు ఊరట లభిస్తుంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచించుకోవాలని కోరుతున్నాం.

విద్యకు 2.6 శాతం నిధులే

- విఠల్. బీడీఎస్ఎఫ్

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్



కేంద్ర బడ్జెట్లో విద్యకు 10 శాతం కేటాయించాల్సింది ఉండగా కేవలం 2.6 శాతం మాత్రమే కేటాయించారు. బీజేపీ ప్రభుత్వం విద్య కాషాయీకరణ చేసే విధంగా బీజేపీ మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని, నూతన జాతీయ విద్యా విధానం ద్వారా విద్య కార్పోరేటీకరణ, కాషాయీకరణ చేసే విధంగా అడుగులు వేయడం శోచనీయం. ఈ బడ్జెట్లో విద్యకు సంబంధించినటువంటి అన్నింటి వాటిపై జీఎస్టీ ఎత్తివేయకుండా అదనపు భారం మోపడం దుర్మార్గం. బీజేపీ ప్రభుత్వం యూనివర్సిటీల అభివద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించక పోవడం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులను చదువుకు దూరం చేసే కుట్ర చేస్తున్నారు. విద్యను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నదని, దేశంలో ఉన్న యూనివర్సిటీలను అభివద్ధి చేయకుండా మన దేశంలోకి విదేశీ యూనివర్సిటీలను ఆహ్వానిస్తూ, ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేయడానికి కుట్రలు పన్నుతున్నారు. విద్యారంగంలో సంస్కరణల పేరుతో సైన్సును పాతరేసి పాఠ్యాంశాల్లో మతపరమైన అంశాలను చేరుస్తూ చరిత్ర వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. విద్యార్థులకు స్కాలర్షిప్స్, ఫెల్లోషిప్, మౌలానా ఆజాద్ ఉపకార వేతనాలు, ఇవ్వకుండా ఎగ్గొట్టి కార్పొరేట్ కంపెనీలకు దోచి పెట్టే విధంగా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తుంది.

పంచాయతీల ఆదాయం పెంపొందించుకోవాలి

- తడిపొడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేసి విక్రయించాలి
- మండలాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

గ్రామాల్లో ప్రతిరోజు తడి, పొడి చెత్తను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ట్రాక్టర్ ద్వారా సేకరించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్లో బుధవారం స్వచ్ఛ భారత్ మిషన్, పంచాయతీరాజ్ చట్టం 2018 లేఅవుట్ రూల్స్, బిల్డింగ్ రెగ్యులేషన్స్ పై మండల స్థాయి అధికారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ట్రాక్టర్ ద్వారా సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్ కు తరలించి తడిపొడి చెత్తను వేరుచేసి సేంద్రియ ఎరువులు తయారు చేయాలని తెలిపారు. సేంద్రీయ ఎరువులను విక్రయించి వచ్చిన ఆదాయాన్ని రిజిస్టర్ లో నమోదు చేయాలని చెప్పారు. పంచాయతీ ఆదాయాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. గ్రామపంచాయతీ ట్రాక్టర్లను జిపిఎస్ ద్వారా అధికారులు పరిశీలన చేయాలని చెప్పారు. ప్లాస్టిక్ వాడకమును తగ్గించే విధంగా గ్రామీణులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అన్ని గ్రామాలలో క్రీడా ప్రాంగణాలను అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఉపాధి హామీ పనులకు కూలీలు అధిక సంఖ్యలో వచ్చే విధంగా చూడాలన్నారు. నీటి సంరక్షణ పనులు గుర్తించి గ్రామీణులకు ఉపాధి కల్పించాలని చెప్పారు. లేఅవుట్ రూల్స్, బిల్డింగ్ రెగ్యులేషన్స్ లపై అధికారులు అవగాహన కల్పించారు. సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, డిఆర్ డిఓ సాయన్న, డిపిఓ శ్రీనివాసరావు, స్వచ్ఛ భారత్ మిషన్ సమన్వయకర్తలు నారాయణ, మురళి కష్ణ, డీఎల్పీఓలు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

అధునాతన సౌకర్యాలతో ఆర్టీసీ బస్సులు

- సూపర్ లగ్జరీ బస్సులను ప్రారంభించిన ఆర్టీసీ ఆర్ఎం ఉషాదేవి

నవతెలంగాణ-బోధన్

నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ డిపోలకు ప్రభుత్వం బిఎస్-6 కాలుష్య రహితమైన, ఆధునిక సౌకర్యాలు కలిగిన సూపర్ లగ్జరీ బస్సులను ప్రభుత్వం అందించిందని, కావున ప్రయాణికులు ఈ బస్సులలో ప్రయాణించి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ రీజియన్ మేనేజర్ ఉషాదేవి అన్నారు. బుధవారం బోధన్ డిపోలో నూతనంగా వచ్చిన మూడు సూపర్ లగ్జరీ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలాంటి కుదుపులు లేని, ఎయిర్ సస్పెన్షన్‌తో నడిచే ఈ బస్సులో ఇద్దరు చొప్పున ప్రయాణికులు కూర్చునేలా సీట్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. బస్సులో సీసీ కెమెరాలు లోపల ,వెనుక కనపడేలా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అలాగే బస్సులో ఆడియో, వీడియో సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. బోధన్ డిపోకు 3, ఆర్మూర్ డిపోకు 1, నిజామాబాద్ ఒకటో డిపోకు 9, రెండవ డిపోకు 2 బస్సులు కేటాయించినట్లు తెలిపారు. బోధన్ బస్టాండ్ నుంచి హైదరాబాద్, ఒంగోలు నగరాలకు ఈ బస్సులు వేసినట్టు తెలిపారు. కావున ప్రయాణికులు ఈ ఆధునిక సౌకర్యాలు కలిగిన బస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎం స్వామీ, మెకానిక్ ఏఈ హరి, ఎంప్లాయి వెల్ఫేర్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభించిన బస్సులో ఆర్ఎం, ఇతర అధికారులు

విద్యపై చిన్నచూపు తగదు

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాచకొండ విఘ్నేష్

నవతెలంగాణ-కంఠేశ్వర్

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన బడ్జెట్ లో నిర్మల సీతారామన్ విద్య రంగంపై చిన్నచూపు చూశారు. విద్యారంగ అవసరాలకు, మౌలిక సదుపాయాలకు సరిపోని బడ్జెట్ దేశ విద్యార్థుల పై అంధకారంలోకి నెట్టేసే బడ్జెట్ ని అందరు వ్యతిరేకించాలి. ప్రభుత్వ విద్యారంగానికి ఈ బడ్జెట్‌లో నిర్దిష్ట ప్రకటనలు ఏమి బిజెపి ప్రభుత్వం చేయలేదు. ఇది ప్రభుత్వ విద్యపై ఉన్న నిర్లక్ష్యాని తెలియజేస్తుంది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మొత్తం బడ్జెట్ ప్రసంగంలో ఒక్కసారి కూడా 'ప్రభుత్వ విద్య' అనే పదాన్ని ప్రస్తావించకపోవడం లోని ఆంతర్యం ఏమిటి అని ప్రభుత్వాన్ని నిలదీశారు. దీనిని బట్టి ఏంత నిర్లక్ష్యం ఉందో అర్థం చేసుకోవచ్చు. గత బడ్జెట్లో విద్యారంగానికి 2022-23 బడ్జెట్ అంచనా మొత్తంలో 2.64% కేటాయింపు చేస్తే ఈ బడ్జెట్ అంచనాలో 2.50%కి తగ్గింది. అలాగే విద్యకు జిడిపిలో 3% కూడా హామీ ఇవ్వలేదు. ఇది ప్రభుత్వం తీసుకుని వస్తున్న నూతన విద్యా విధానం అమలు చేయడానికి వాగ్దానం చేసిన దానిలో సగం మాత్రమే. జాతీయ విద్యా మిషన్‌కు బడ్జెట్‌లో 600 కోట్లు కేటాయించారు. ఇది కూడా గత బడ్జెట్ కంటే తక్కువ. విద్యా సాధికారత కోసం గత బడ్జెట్ నుండి 826 కోట్లు కేటాయింపు చేశారు. ప్రస్తుత దాని ప్రస్తావన లేదు. ఆల్ ఇండియా సర్వే ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఐశ్మేఎంజు 2020-21) ప్రకారం 2020-21లో విద్యలో ఎస్సీ విద్యార్థుల నిష్పత్తి 14.2 శాతానికి పడిపోయింది, అంతకుముందు సంవత్సరం 14.7 శాతం, ఓబీసీ విద్యార్థుల నిష్పత్తి 37 శాతం నుండి 35.8 శాతం మరియు ముస్లిం విద్యార్థులు 5.5% నుండి 4.6%కి పడిపోయింది. వికలాంగుల విభాగంలో విద్యార్థుల సంఖ్య కూడా 92,831 నుండి 79,035కి పడిపోయింది. ఈ అసమానంగా తగ్గిపోతున్న విద్యార్థుల నిష్పత్తులన్నీ గత అనేక సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాల ఫలితంగా ఏర్పడినవి. మరియు ప్రతి సంవత్సరం ఈ అసమానతలు పెరుగుతున్నాయి. ఈ అసమా నతలు ఏందు కంటే విద్యారంగంలో గత అనేక సంవత్సరాలు నుండి అమలు చేస్తున్న నయా-ఉదారవాద విధానాల ఫలితం, విద్య ప్రైవేటీకరణకు దారితీసింది. మరియు అట్టడుగు వర్గాల విద్యార్థులను చదువుకు వెళ్ళకుండా నెట్టివేసింది. ఈ బడ్జెట్ ను చూస్తుంటే విద్యను ప్రైవేటీకరణకు, కార్పొరేట్ శక్తులకు మిరితం చేసేటట్టుగా ఇలాంటి విద్యా వ్యతిరేక బడ్జెట్ కి వ్యతిరేకంగా రానున్న రోజుల్లో పోరాటాలు చేయాలని ప్రభుత్వాలు హెచ్చరించారు.



పెండ్లికి సర్పంచ్ ఆర్థిక సాయం

నవతెలంగాణ-లింగంపేట్

పేదరికంతో సతమతమవుతున్న పేదింటి పెండ్లికూతురికి సురాయిపల్లి సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి ముందుకొచ్చి ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. పేద పెండ్లి కూతురు కుటుంబానికి ఆసరాగా నిలిచారు. కర్రే బాలమణి కూతురు సౌజన్యకు పెండ్లి ఖర్చుల నిమిత్తం సర్పంచ్ కుచనపల్లి రాజశేఖర్‌రెడ్డి బుధవారం పెండ్లికూతురు ఇంటికి వెళ్లి రూ.5వేలు సహాయంగా అందజేశారు.



ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

మైనార్టీలకు బడ్జెట్‌లో మొండిచేయి

- మాజీ మంత్రి షబ్బీర్ అలీ

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్



కేంద్ర ఆర్థిక మంత్రి సమర్పించిన కేంద్ర బడ్జెట్‌లో మైనారిటీల సంక్షేమానికి 38 శాతానికి పైగా నిధులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తగ్గించిందని మాజీ మంత్రి మహ్మద్ అలీ షబ్బీర్ తీవ్రంగా ఖండించారు. బుధవారం లోక్‌సభలో నిర్మలా సీతారామన్. బడ్జెట్ ప్రసంగంపై షబ్బీర్ అలీ స్పందిస్తూ.. బీజేపీ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి కేటాయించిన రూ. 2022-23లో 5,020.50 కోట్లకు రూ. 2023-24లో రూ. 3,097.60 కోట్లు, కోత రూ. 1,922.90 కోట్లు లేదా దాదాపు 38 శాతం. "ప్రధాని నరేంద్ర మోడీ 'సబ్కా సాథ్, సబ్కా వికాస్' నినాదానికి ఇది ప్రతిబింబమా? కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం కోసం నిధులను తగ్గించడం ద్వారా వారిని సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా అణిచివేస్తోందని ఆరోపించారు. పేద మైనారిటీల ఆర్థిక, విద్యా సాధికారత కోసం ఉద్దేశించిన పథకాలను మోడీ ప్రభుత్వం క్రమపద్ధతిలో లక్ష్యంగా చేసుకుంటోందని షబ్బీర్ అలీ అన్నారు.

మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-రాజంపేట్

మండలంలోని తలమడ్ల గ్రామంలో మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులు పెట్టిగడి నర్సింలు, ఉపాధ్యక్షులు పెట్టిగాడి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి పెట్టిగాడి యశ్వంత్, కోశాధికారి సాయిలు ఎన్నికయ్యారు. సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని రామేశ్వర్‌పల్లి వడ్డెర సంఘ నూతన కార్యవర్గాన్ని బుధవారం సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షునిగా గంగాధర్, ఉపాధ్యక్షుడిగా వెంకట్, కార్యదర్శిగా వినోద్ కుమార్, సహాయ కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా సంతోష్ కుమార్, సలహాదారులుగా మల్లేశం, శంకరయ్య, మధుసూదన్, మహిపాల్, రాజ్యం, డైరెక్టర్లుగా మోహన్, శశికుమార్, మహేష్, ఆనంద్, రాజు, సభ్యులు మహేష్‌బాబు, మనీష్, భరత్‌ను ఎన్నుకున్నారు.

గంగపుత్ర ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశి

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలో బుధవారం గంగపుత్రుల ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశిని ఘనంగా నిర్వహించారు. బోనాలను ప్రధాన వీధుల గుండా ఊరేగించి, గ్రామ పరిధిలో గల గంగమ్మ దేవాలయంలో జలాభిషేకం చేశారు. అనంతరం గంగపుత్రుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రామారెడ్డి గంగపుత్రుల సంఘం సభ్యులతో పాటు, వివిధ గ్రామాల గంగపుత్రులు పాల్గొన్నారు.

న్యాయవృత్తి నైపుణ్యాలు పెంచుకోవాలి

● న్యాయవిద్యార్థులకు వైస్ ఛాన్సలర్ ఉద్బోధ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

న్యాయ విద్యార్థులు మూట్ కోర్టులో ప్రయోగాత్మక చర్చల్లో పాల్గొని న్యాయవృత్తి నైపుణ్యాలు పెంచుకుని గొప్పగా ఎదగాలని, న్యాయ విద్యార్థులకు మూట్ కోర్టు ఒక ప్రయోగశాల లాంటిదని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్ అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ లోని న్యాయ కళాశాలలో బుధవారం మూట్ కోర్టును ప్రారంభించారు. ఈ ప్రారంభ సమావేశానికి ముఖ్యఅతిథిగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్ పాల్గొని మాట్లాడారు. యూనివర్సిటీలో మూట్ కోర్టును ప్రారంభించడం చారిత్రాత్మకమని, విద్యార్థులు ఇక్కడ న్యాయ విషయాలపై చర్చించి జ్ఞానాన్ని సంపాదించి కోర్టుల్లో విజయపథంలో నిలవాలని అన్నారు. సమస్యల పరిష్కారంకోసం అనేక మంది కోర్టుకు వస్తారని, వారికి న్యాయ విద్యార్థులు న్యాయవాద వృత్తిలో ఉండి న్యాయం చేయాలని తెలిపారు. మూట్ కోర్టు ని అందంగా తీర్చిదిద్దిన వడ్రంగి స్వామిని శాలువాతో సత్కరించారు. గౌరవ అతిథి గా హాజరైన రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ విద్యావర్ధిని మాట్లాడుతూ విద్యార్థులు రెగ్యులర్ గా కళాశాలకు హాజరై మూట్ కోర్టు ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. డీన్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధి చెందిన నాయకులు న్యాయ విద్యనభ్యసించారని వివరించారు. న్యాయ విద్యను అభ్యసించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాత గా ప్రముఖులుగా అయ్యారని పేర్కొన్నారు. సమావేశంలో ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, డీన్ ఆఫ్ లా రాసిన న్యాయ పుస్తకాలను వైస్ ఛాన్సలర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆత్మీయ అతిథులుగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆరతి, మరియు హెడ్ డాక్టర్ స్రవంతి, బివోయస్ డాక్టర్ ఎల్లోస, డాక్టర్ ప్రసన్న రాణి, పరిశోధకుడు సతీష్ చంద్ర, న్యాయవాదులు పులి జైపాల్, బాలరాజు నాయక్, చరణ్ న్యాయ కళాశాల విద్యార్థులు హాజరయ్యారు.


మూట్ కోర్టును ప్రారంభిస్తున్న వీసీ

రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి

● పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ శీతాకాల బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి 30శాు. శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ తెలంగాణ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి, యూనివర్సిటీ కన్వీనర్ కర్క గణేష్ మాట్లాడుతూ నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయకపోవడం మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం సిగ్గుచేటని అన్నారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్ ఛార్జీలు కాస్మోటిక్ ఛార్జీల బకాయిలను వెంటనే విడుదల ధరలకు అనుగుణంగా పెంచాలని డిమాండ్ చేశారు. హాస్టల్లో,యూనివర్సిటీలో విద్యార్థులకు అనుగుణంగా హాస్టల్ భవనాలు నిర్మించాలని అన్నారు. లేకుంటే చలో అసెంబ్లీ కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నిజామాబాద్ పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.కే అఫ్షర్, అనిల్, జిల్లా నాయకులు మహిపాల్ శంకర్, వినయ్, శృతి, స్ఫూర్తి, వెంకటేష్, రాకేష్, మణికంఠ, సాయి ప్రకాష్, భార్గవి, వర్షిని, ప్రొఫెసర్లు నజీర్, ప్రిన్సిపల్ ఆరతి, బాలా శ్రీనివాస మూర్తి, రమణ చారి, నాగరాజు,స్వప్న, దత్త హరి, స్వామి, రవీందర్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఏసీడీ చార్జీల వసూళ్లను నిలిపివేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఏసీడీ చార్జీల వసూళ్లను నిలిపివేయాలని సీపీఐ(యం-యల్) న్యూ డెమోక్రసీ నిజామాబాద్ డివిజన్ కార్యదర్శి వేల్పూర్ భూమయ్య డిమాండ్ చేశారు. ఏసిడి చార్జీలను నిరసస్తూ బుధవారం అర్బన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వేల్పూర్ భూమయ్య మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు నాయకత్వంలో విచ్చలవిడిగా పెంచుతున్న విద్యుత్ ఛార్జీల వల్ల ప్రజలపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతుందన్నారు. చార్జీలతోపాటు టారిఫ్ రేట్లు మార్చడం, యూనిట్ల స్లాబ్‌లు మార్చడంతో ఇబ్బంది పడుతున్న ప్రజలపై గత సంవత్సరం లోడ్ డిపాజిట్ పేరుతో (ఎక్కువ కరెంటు వాడుతున్నందుకు) ఒక్కో సర్వీస్ మీటర్‌పై 2000 నుండి 5000 వరకు లోడ్ డిపాజిట్ ప్రభుత్వం రాబట్టింద న్నారు. ఏసిడీ డిపాజిట్ల పేరుతో రెండు నెలల కరెంటు బిల్లును అడ్వాన్స్ డిపాజిట్ చేయమని సిద్ధమయ్యారని తెలిపారు. ఆ సంస్థ సిఎండి గోపాల్ రావు మొండి బకాయిలు పెరగడంతోనే డిపాజిట్లు వసూలు చేస్తున్నాం అనడం సిగ్గుచేటన్నారు. బకాయిలు వసూలు చేయడంలో విఫలయ్యారన్నారు. విద్యుత్ చార్జీల దోపిడీని ఆపకపోతే నిరసన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ నాయకులు నీలం సాయిబాబా, దేశెట్టి సాయి రెడ్డి, శివ కుమార్, జన్నారపు రాజేశ్వర్, మోహన్, జె.పి. గంగాధర్ , గోపాల్, భాస్కర్, భారతి తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న నాయకులు

తపాల బీమా పథకాలపై అవగాహన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి సబ్ పోస్టాఫీస్ లో అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ సౌత్ సబ్ డివిజన్ ఐపిఓ సంతోష్ కుమార్ తెలిపారు. బుశవారం ఇందల్ వాయి పోస్టాఫీసులో పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రవేశపెట్టి 140 ఏళ్ల పూర్తి అయిన సందర్భంగా ప్రజలకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ సౌత్ సబ్ డివిజన్ ఐపిఓ సంతోష్ కుమార్ తపాలా బీమా పథకాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సుకన్య సమృద్ధి యోజన, నొకరింగ్ డిపాజిట్ పథకం , సేవింగ్స్ పథకం, గ్రామీణ తపాలా బీమా, తదితర పథకాలు, ఖాతాలపై ప్రజలకు క్షుప్తంగా వివరించారు. ఒక్క రోజులోనే సుమారు 100 పోస్టల్ ఖాతాలు, లక్ష రూపాయల ఇన్సూరెన్స్ ప్రీమియం ప్రజల నుండి సేకరించామన్నారు. పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ మాట్లాడుతూ.. తపాలా శాఖలో ప్రజలకు ఉపయోగపడే పథకాలు ఎక్కువ వడ్డీ రేటు అందిస్తున్నాయని, గ్రామీణ తపల బీమా ఎక్కువ బోనస్ అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ ఎం సాయి వెంకటేష్, ఇందల్ వాయి పోస్టల్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కిడ్నాపర్ల రిమాండ్

నవతెలంగాణ-సిరికొండ

జనవరి 30న గడ్కోల్ గ్రామానికి చెందిన గురుజు కింది సతీష్ ను కిడ్నాప్ చేసిన ఘటనలో భీంగల్ మండలానికి చెందిన మల్లేష్, ఆయన అనుచరులు శ్రావణ్, పూజిత్, జింక మహేష్, దినేష్‌ను పట్టుకొని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నర్సింలు తెలిపారు.కిడ్నాప్ కు గురైన సతీష్‌ను వారి బారి నుండి రక్షించి, నేరస్తుల వద్ద నుండి హుందాయ్ కారు, రెండు మోటార్ సైకిల్ లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నేరస్తులను రాజన్న సిరిసిల్ల జిల్లా కొండగట్టు సమీపంలో పట్టుకున్నట్లు తెలిపారు. ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలి

● లేదంటే జరిమానాలు విధిస్తాం : ట్రాఫిక్ సిఐ

●ఆటో డ్రైవర్లకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆటోడ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలని అలాగే వాహనాల ధ్రువపత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని, ట్రాఫిక్ రూల్స్ తూచా తప్పకుండా పాటించాలని నిజామాబాద్ ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ అన్నారు. బుధవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వీక్లీ మార్కెట్లో ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇతర ప్రాంతాల నుండి జిల్లా కేంద్రానికి వచ్చే వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలను పాటించాలన్నారు. లేకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే జరిమానాలను సైతం విధిస్తామని తెలిపారు. ద్విచక్ర, త్రి వాహనదారులు వాహనాలకు నంబర్‌ప్లేట్ లేకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. ద్విచక్ర వాహనదారులు స్పీడ్‌ను అదుపుచేసుకోవాలని, ఆటో డ్రైవర్లు కూడా మితిమీరి ప్యాసింజర్లను కూర్చోబెడితే వాహనాలను సీజ్ చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సుమారు 25 మంది ఆటో డ్రైవర్లు, ట్రాఫిక్ ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన రథ సంప్రోక్షణ

ప్రత్యేక పూజలో పాల్గొన్న బోధన్ ఏసిపి కిరణ్ కుమార్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నూతన రథ సంప్రోక్షణ కార్యక్రమం మండలకేంద్రంలో బుధవారం నిర్వహించారు. ఇటీవల నూతనంగా తయారు చేయించిన రథానికి బ్రహ్మంగారి మఠం ఆస్థాన సిద్ధాంతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అలంకరించిన రథాన్ని హాసకొత్తూరు చౌరస్తా నుండి బ్రహ్మంగారి గుడి వరకు ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి గడ్డం స్వామి, ఎంపీటీసీ సభ్యులు మైలారం సుధాకర్, గ్రామ కమిటీ అధ్యక్షులు బద్దం రాజేష్, ఉపాధ్యక్షులు కౌడ నర్సయ్య, కోశాధికారి చిలువేరి భూమేశ్వర్, ప్రధాన కార్యదర్శి ఆకోజి అంకిత్, సలహాదారులు చింత గణేష్, గ్రామకమిటీ సభ్యులు, అన్నదాన కార్యక్రమం నిర్వహణ దాత ధాత్రిక భూమేశ్వర్, డికొండ సాయి కృష్ణ, గ్రామప్రజలు పాల్గొన్నారు.కమ్మర్ పల్లి పూర్వీకులైన ఏసిపి కిరణ్ కుమార్ రథం ఊరేగింపులో పాల్గొని అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఏసీపీకి ఎ సర్పంచి గడ్డం స్వామి, ఎంపీటీసీ సభ్యులు మైలారం సుధాకర్, గ్రామ కమిటీ అధ్యక్షులు బద్దం రాజేష్, ఉపాధ్యక్షులు కౌడా నర్సయ్య, కోశాధికారి చిలువేరి భూమేశ్వర్, ప్రధాన కార్యదర్శి ఆకోజి అంకిత్, సలహాదారులు చింత గణేష్, గ్రామం కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు.

ఏసీడి చార్జీలు రద్దు చేయాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-మాక్లూర్

ఏసీడి చార్జీలు రద్దు చేయాలని సిపిఐ(ఎం) నాయకులు డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేశారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొండ గంగాధర్ మాట్లాడుతూ.. ఏసీడి పేరుతో ప్రజలపై వేస్తున్న ఈఅదనపు చార్జీలను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని, ఏసిడి చార్జీలు అడ్వాన్స్ కంజక్షన్ డిపాజిట్ పేరుతో వేస్తున్న అదనపు భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పద్మారావు, బాలరాజు, సాయి, హుస్సేన్, రాంజీలు పాల్గొన్నారు.